V3 NEWS
లక్ష్యం సమాజహితం

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం
09-06-2024
సంపుటి : 01 | సంచిక : 36 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB
CMD

‘రామోజీ మరణంతో మీడియా, వినోద రంగం ఓ టైటాన్‌ను కోల్పోయింది. రామోజీరావు ఓ వినూత్న వ్యాపారవేత్త. ఈనాడు, ఈటీవీ నెట్‌వర్క్, రామోజీ ఫిల్మ్ సిటీ సహా అనేక సంస్థలను స్థాపించి ఎంతో మందికి ఉపాధి కల్పించారు. తన దూరదృష్టితో ఎన్నో విజయాలు సాధించి సమాజంలో చెరగని ముద్రవేశారు. మీడియా, సినీ పరిశ్రమల్లో సేవలు ఆయన సేవ చిరస్మరణీయం. పద్మవిభూషణ్ అందుకున్నారు. **-రాష్ట్రపతి ముర్ము**



రామోజీరావు అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడు రామోజీరావు. పత్రికారంగంలో సరికొత్త ప్రమాణాలు నెలకొల్పారు.. పత్రిక, సినీ, వ్యాపార రంగాలపై చెరగని ముద్ర వేశారు. అతను భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడు. అతని గొప్ప రచనలు జర్నలిజం మరియు చలనచిత్ర ప్రపంచంపై చెరగని ముద్ర వేశాయి.
**- ప్రధాని నరేంద్ర మోడీ**



"రామోజీరావు దేశ రాజకీయాల్లో, పత్రిక, ప్రసార రంగంలో దేశానికి ఆదర్శంగా నిలబడి పత్రికలు ప్రతిపక్ష సాధనలు పాత్ర పోషిస్తాయని నిరూపించారు. వ్యాపారంలో, ప్రజాసేవలో ప్రజా సమస్యలను లేవనెత్తి పాలకుల నుంచి ప్రజలకు మేలు జరిగేలా పోరాటం చేసిన వ్యక్తి రామోజీరావు."
**- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి**





బహుముఖ ప్రజ్ఞాశాలి, రామోజీరావు అస్తమయం భారతదేశ పత్రిక, టీవీ రంగానికే కాక ,యావత్ తెలుగు ప్రపంచానికి తీరని లోటు .ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించి ఒక జీవితకాలంలోనే ఒక వ్యక్తి ఎంత ఎత్తుకైనా ఎదగొచ్చు అన్న నిజాన్ని రామోజీ రావు గారి జీవితాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. ఐదు దశాబ్దాల పాటు ప్రచార, ప్రసార

వాణిజ్య వ్యాపార సినీ పరిశ్రమల పై రామోజీరావు తనదైన ముద్రవేశారు. ముఖ్యంగా తెలుగు వాంగ్మయానికి .నుడికారానికి వ్యాకరణానికి, భాషా ఉచ్చరణకి ,రామోజీరావు గారు చేసిన సేవలు చిరస్మరణీయం తెలుగు పత్రిక రంగంలో అన్యదే సియాలు రాకుండా, అచ్చమైన తెలుగు వాడుక భాషను అందరూ చదవడానికి మాట్లాడడానికి వీలుగా తన పత్రిక ద్వారా విశేషమైన ప్రాచుర్యాన్ని కల్పించారు. తాను నిర్మించిన సినిమాల ద్వారా అశ్లీలత లేని ఆహారకరమైన చిత్రాల అందించారు . తాను నిర్మించిన రామోజీ ఫిలిం సిటీ ద్వారా హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో ప్రముఖంగా నిలిపారు.

పాడుతా తీయగా వంటి అత్యంత అభిరుచి కలిగిన రియాల్టీ షో ల ద్వారా సంస్కారవంతమైన కార్యక్రమాలను రూపొందించారు. రామోజీరావు మరణం సాహిత్య సంగీత సినీ ప్రియులను. విషాదంలో ముంచెత్తింది.

# అక్షర మార్గదర్శి అస్తమయం

## ఈనాడు గ్రూప్ ఆఫ్ సంస్థల చైర్మన్ రామోజీరావు కన్నుమూత

### కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నా రామోజీ

### చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి

### కృష్ణా జిల్లా పెదపారుపూడిలో జన్మించిన రామోజీరావు

### ఈనాడు పత్రిక స్థాపనతో దేశవ్యాప్తంగా సంచలనం

### ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్మ్ సిటీ నిర్మాణం

### రామోజీ మృతికి మోడీ సహ చంద్రబాబు, రేవంత్ నివాళి

### ఫిల్మ్ సిటీకి తరలివస్తున్న సినీ, రాజకీయ ప్రముఖులు

### నేడు ఉదయం ఆర్ఎఫ్సీలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



**విశ్వంభర, హైదరాబాద్ :**

ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు (88) కన్నుమూశారు. తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా రామోజీరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో.. కుటుంబ సభ్యులు ఆయన్ను హుటాహుటీన నానక్ రామ్ గూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో శనివారం తెల్లవారుజామున 3:50 గంటలకు చికిత్స పొందుతు తుదిశ్వాస విడిచారు. నానక్ రామ్ గూడ లోని ఆసుపత్రి నుంచి ఫిల్మ్ సిటీకి ఆయన భౌతికాయంను తరలించారు. రామోజీరావు అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు 1936 నవంబర్ 16న కృష్ణా జిల్లా పెదపారుపూడిలో రామోజీరావు జన్మించారు. రామోజీరావు మృతిపట్ల సినీ, రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. **మిగతా2లో...**

## విజయానికి ఎమోజీ.. రామోజీ..!



స్కూల్లో అక్షరాలు నేర్చుకుంటున్నప్పుడే ఈనాడులో అక్షరాలు చదవడం మొదలు పెట్టి ఉంటానేమో... ఈనాడు దినపత్రికలో శీర్షికల రూపంలో ఉండే పెద్ద అక్షరాలలో ఆఆఇఈలు వెతికి గుర్తు పట్టేవి కళ్ళు... ఈ అయితే కొట్టొచ్చినట్టు పేరులోనే కనిపించిన శిఖరాక్షరం...

కాస్త అక్షర జ్ఞానం పెరిగేటప్పటికి అదే ఈనాడులో మాటలు... వాక్యాలు... సినిమా బొమ్మలు... గవాస్కర్... గుండప్ప విశ్వనాథ్ ఫొటోలు... ఇలా ఆ పత్రికలో ప్రతి అంశం ఒక బాలశిక్షలా... రేపటి నా జర్నలిజానికి అదే శిక్షణలా... రోజులు గడిచాయి... క్యాలండర్లు మారాయి... ఈనాడులో సంచిక... సంపుటిలు తిరగబడుతూనే ఉన్నాయి. ఆ పత్రికపై ఆసక్తి పెరుగుతూనే ఉంది...

అక్షరాలు ఏరుకుని చదివే దశ నుంచి పుటలు... పేరాలు... పేజీలు తిప్పుతూ నెమ్మదిగా ఈనాడు చదవడం అనేది ఒక వ్యసనంగా మారింది. అర్థం కాని రోజుల నుంచి... అర్థాలు వెతుకుతూ... అనర్థాల గురించి తెలుసుకుంటూ... అంతరార్థాలు తెలుసుకుంటూ... చాలా పెద్ద ప్రయాణం ఈనాడుతో... ప్రతి నాడు...!

పేపర్ వస్తే చూడ్డం మొదలుకుని... పేపర్ అందుకోవడం వరకు... రోజూ ఎదురు చూడ్డం దాకా... రాకపోతే వెళ్లి తెచ్చుకునే దశ... అలా చదువుతూ ఎప్పటికైనా మనమూ ఒక జర్నలిస్టు అయితే... అన్న ఆశ...!

జీవితంలో ఇంకొన్ని పేజీలు తిరిగాయి... ఈనాడులో వార్తలు చదివి... అవగాహన చేసుకుని... జిజ్ఞాస పెంచుకుని...
ఆ పత్రికలో వచ్చిన హెడ్డింగులకు ప్రత్యామ్నాయంగా హెడ్డింగులు... ఆ పక్కనే రాసి... మనదే వాసి అనే చిన్న లెవెల్... అప్పటికి మన బుర్ర ఈనాడుకు పేర్లల్... ఓ భ్రమ...
అయినా భవిష్యత్తు అక్కడే నిర్మాణమై నెరవేరిన ఓ కల...
ఆ పత్రిక ద్వారానే అబ్బిన రాయడం అనే ఓ కళ...!

ఊహ తెలిసాక... పత్రికా రంగ ప్రముఖుల్లో మొదటగా తెలుసుకున్న ఇద్దరు వ్యక్తులు... ఇండియన్ ఎక్స్ప్రెస్ గ్రూపు సంస్థల చైర్మన్ రామనాథ్ గోయెంకా... ఈనాడు అధినేత రామోజీరావు... జాతీయ నాయకుల్లో గాంధీ.. నెహ్రూ బొమ్మల్లా... చిత్రపరిశ్రమలో ఎన్టీఆర్...ఏయెన్నార్ పేర్లలా... గోయెంకా... రామోజీరావు... ఈ పేర్లు హృదయ ఫలకంపై ముద్రించుకుపోయాయి...!

ఈనాడు ప్రస్థానం... రామోజీరావు
దిగ్విజయ యాత్ర... పత్రిక గెలుపులు...
దాని మలుపులు... నలుపు తెలుపులు...
సంచలన మెరుపులు... రంగుల తళుకులు...
సంపాదకీయ చెణుకులు... ఎడిట్ పేజీ ఆర్టికల్
విశ్లేషణలు... కార్టూన్ బాంబులు...
కొన్ని పాలక పక్ష రుబాబులు...
మొక్కవోని ధైర్యంతో పెద్దాయన జవాబులు...
ఎమర్జెన్సీ రోజుల నాటి
సవాళ్లు...దుర్మార్గపు పాలనను ఎదిరించిన
రుధిరాక్షరాల ఆనవాళ్లు... 1982లో తెలుగు విభవుడు
నందమూరి తారక రామారావు రాజకీయ ఆగమనవేళ సాగిన
సంచలన ప్రచార హేల... చెప్పుకుంటూ పోతే
ఈనాడు లేనిదెక్కడ... రామోజీ రానిదెప్పుడు...

ఎన్ని ఆలోచనలు... తొలి పేజీలో కార్టూన్ మొదలు... బ్యానర్ ఓ సంచలన వార్త... ఈనాడు ఆదివారంలో సమరం దుమారం... హోమియో పావులూరి... ఆసక్తి పెంచిన పజిల్... చిన్న పేపర్లు... ఎన్ని ట్రెండ్లు... పేలుతూ ఉన్నా అప్పుడప్పుడు వ్యతిరేక గుండ్లు...!

రామోజీ... అక్షరం కాని శిలాక్షరం...
పత్రికా రంగంలో ఉన్నత సింహాసనం...
ప్రత్యక్షంగానో...పరోక్షంగానో రాజకీయంలోనూ శాసనం...
జగం మెచ్చిన మేరునగం...
జాతీయ పత్రికా రంగంలో ఆయనే సగం...

వ్యక్తి... శక్తి... యుక్తి... దీయుక్తి...

రాతగాడికి... ఆటగాడికి... పాటగాడికి... వార్తల వేటగాడికి...
నటుడికి... రచయితకి... దర్శకుడికి... మొత్తంగా కళకి...
కళాకారుడికి... ఆయన పెద్ద దిక్కు...
అద్భుతం ఆయన దృక్కు...
నిజానికి ఆయనే 88×365 పేజీల అతి పెద్ద బుక్కు...
తెలుగు జర్నలిజానికి వేద వాక్కు...

తెలుగు పత్రికా రంగంలో మకుటం లేని మహారాజు.. ఎవ్వరికీ తలవంచని మేరు పర్వతం రామోజీ రావుకు ‘విశ్వంభర’ తరుఫున అక్షర నివాళి అర్పిస్తూ..



**- డాక్టర్ కాచం సత్యనారాయణ**
చైర్మన్ &ఎడిటర్, V3 న్యూస్, విశ్వంభర దిన పత్రిక

తెలంగాణ ప్రజలకు
## గుడ్ న్యూస్..

- ఆరోగ్యశ్రీలో మరికొన్ని సేవలు
- కొత్తగా మరో 65 చికిత్సలు
- అదనంగా రూ.497.29 కోట్లు విడుదల
- ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి

2



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 147 | ₹ 169 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹245 | ₹279 |

తెలంగాణ ఫలితాలపై
## అసంతృప్తి

### టీపీసీసీపై సీడబ్ల్యూసీ సమావేశంలో సీరియస్

- 14 సీట్లు పక్కా అన్నారు.. ఎనిమిదేనా..?
- పథకాలు అమలు చేసినా ఫలితం దక్కలే..!
- ఎన్డీఏను ఇరకాటంలో పెట్టడంతో ఫెయిల్
- టీ కాంగ్రెస్ నేతలు ప్రత్యేకంగా మీట్ అవ్వండి
- రాష్ట్ర నేతలపై మల్లికార్జున ఖర్గే అసహనం



2

## మోడీ.. రాజీనామా చేస్తారా?

- మోడీ గ్యారెంటీకి వారెంటీ అయిపోయింది
- యూపీలో బీజేపీని ప్రజలు తిప్పికొట్టారు
- కంటోన్మెంట్ ప్రజలు మరో సీటు అదనంగా ఇచ్చారు
- ఢిల్లీ వేదికగా పీఎం మోడీకి రేవంత్ కౌంటర్



2

## రాకేశ్ రెడ్డీ.. మీరు కష్టపడ్డారు..

### ఫలితాలు ఎప్పుడూ ఆశించినట్లుగా ఉండవు: ఎమ్మెల్సీ అభ్యర్థికి ధైర్యం చెప్పిన కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** నల్గొండవరంగల్‌ఖమ్మం గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో రెండోస్థానంలో నిలిచిన పార్టీ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధైర్యం చెప్పారు. **మిగతా2లో...**

# తెలంగాణ ఫలితాలపై అసంతృప్తి



**విశ్వంభర, ఢిల్లీ:** ఇటీవల వెలువడిన పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బాగా సీరియస్ అయ్యారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటి (సీడబ్ల్యూసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాల్లో పార్టీ సాధించిన ఫలితాలపై రివ్యూ చేశారు. ఓవరాలుగా పార్టీ సాధించిన ఫలితాలపై ఖర్గేతో పాటు సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది. అయితే ఇదే సమయంలో అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ సాధించిన ఫలితాలపైన ఖర్గే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణా, హిమాచల్ ప్రదేశ్, కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. ఈ మూడు రాష్ట్రాల్లోను అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన కాంగ్రెస్ పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం ఆశించిన ఫలితాలను సాధించలేకపోయిందని ఖర్గే తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు.

**14 సీట్లన్నారు.. ఎనిమిదేనా..?**

మిగిలిన రెండు రాష్ట్రాలను వదిలేస్తే తెలంగాణ విషయంలోనే అధ్యక్షుడు ఎక్కువగా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీవర్గాల సమాచారం. కారణం ఏమిటంటే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఐదు నెలలు మాత్రమే అయ్యింది. 2023 నవంబర్ 30వ తేదీన జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 సీట్లతో అధికారంలోకి వచ్చింది. మే 13వ తేదీన జరిగిన పార్లమెంటు పోలింగులో పార్టీకి కేవలం 8 సీట్లు మాత్రమే దక్కింది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 64 సీట్ల దామాషాను చూసుకుంటే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 9 సీట్లు దక్కుండాలి. కాని పార్టీ గెలిచింది 8 సీట్లు మాత్రమే. ఇక్కడ విషయం ఏమిటంటే మొదటినుండి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పార్టీకి 14 సీట్లు గ్యారెంటీగా వస్తాయని చెప్పారు.

**పథకాల ఫలితం ఏది..?**

17 నియోజకవర్గాల్లో 27 రోజుల్లో రేవంత్ 53 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. సభలే కాకుండా కార్నర్ మీటింగులు, రోడ్డుషోలు, ర్యాలీల్లో అదనంగా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ కూడా చాలాసార్లు ప్రచారం, రోడ్డుషోల్లో పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన సిక్స్ గ్యారెంటీస్ లో నాలుగింటిని పార్టీ అమలు కూడా చేసింది. ఇంతచేసినా పార్టీకి అనుకున్నన్ని సీట్లు దక్కలేదన్నదే ఖర్గే బాధ. 14 సీట్లు వస్తాయని రేవంత్ ఎంతచెప్పినా 10 సీట్లకైతే తగ్గదనే అందరు అనుకున్నారు. పార్టీ నేతలు కూడా అదే అంచనా వేశారు. తీరాచూస్తే ఎనిమిది సీట్లకు మాత్రమే పరిమితమైంది. 2019 ఎన్నికలతో పోల్చితే మంచి ఫలితం సాధించినట్లే అనుకోవాలి.

**ఖర్గే బాధకు కారణం ఇదే..**

2019లో కాంగ్రెస్ గెలిచింది కేవలం 3 సీట్లలో మాత్రమే. ఇపుడు గెలిచిన ఎనిమిది సీట్లను చూస్తే మంచి ఫలితం సాధించినట్లే అనుకున్నా అంచనాలకు, ఆశించిన సీట్లకు చాలా తేడా ఉంది. ఈ విషయంలోనే ఖర్గే తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. పై మూడు రాష్ట్రాల్లో పార్టీ ఆశించిన ఫలితాలను సాధించుంటే ప్రభుత్వఏర్పాటులో ఎన్డీయే బాగా ఇబ్బందిపడుండేదనటంలో సందేహంలేదు. ఈ విషయమే ఖర్గేని చాలా బాధపెడుతున్నట్లుంది. అంచనాలకు తగినట్లుగా రాణించని పై మూడు రాష్ట్రాల ఫలితాలపై తొందరలోనే ప్రత్యేకంగా సమావేశం అవబోతున్నట్లు ఖర్గే సమావేశంలోనే చెప్పారని సమాచారం.

# అక్షర మార్గదర్శి అస్తమయం

(మొదటి పేజీ తరువాయి)

వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామోజీతో వారికిఉన్న అనుబంధాన్ని ప్రముఖులు గుర్తుచేసుకున్నారు. రామోజీరావు ఈనాడు దినపత్రికతో తెలుగు రాష్ట్రాల్లో చెరగని ముద్రవేశారు. 1969లో రామోజీరావు ప్రారంభించిన మొట్టమొదటి పత్రిక అన్నదాత. 1974 ఆగస్టు 10న విశాఖలో ఈనాడును రామోజీరావు ప్రారంభించారు. మార్గదర్శి చిట్ ఫండ్, ప్రియా ఫుడ్స్, కళాంజలి సంస్థలను స్థాపించారు. 2016లో రామోజీరావుకు దేశ అత్యున్నత పురస్కారం దక్కింది. పద్మవిభూషణ్ తో కేంద్ర ప్రభుత్వం గౌరవించింది. ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీని రామోజీరావు నిర్మించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి రామోజీరావు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అదేవిధంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి, శ్రీశ్రీ రవిశంకర్ విశ్వవిద్యాలయం నుంచి రామోజీరావు డాక్టరేట్లు అందుకున్నారు.

**నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు**

ఆదివారం ఉదయం రామోజీరావు అంత్యక్రియలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఢిల్లీలోఉన్న సీఎం రేవంత్ రెడ్డి రామోజీ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ఇప్పటికే సీఎస్ కు ఆదేశాలు జారీ చేశారు.

**తన పేరు తానే పెట్టుకున్న రామోజీ**


రామోజీ రావు అసలు పేరు రామయ్య. రామయ్య రామోజీ రావుగా మారటం వెనుక ఓ ఆసక్తికర ఘటన దాగి ఉంది. రామోజీరావు స్వగ్రామం కృష్ణా జిల్లా పెదపారుపూడు. 1936 నవంబరు 16న ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. రామోజీరావు పూర్వీకులు పామర్రు మండలంలోని పెరిశేపల్లి గ్రామానికి చెందినవారు. అతని తాత రామయ్య కుటుంబంతో పెరిశేపల్లి నుంచి పెదపారుపూడికి వలస వెళ్లారు. తాత రామయ్య మరణించిన 13 రోజులకే రామోజీ రావు జన్మించారు. దాంతో అతని జ్ఞాపకార్థం తల్లిదండ్రులు రామయ్య అన్న పేరు పెట్టారు. అయితే చిన్నతనం నుంచి విలక్షణంగా, విభిన్నంగా ఆలోచించే రామయ్య తన పేరును తానే మార్చుకున్నారు. పాఠశాల దశలో నీ పేరేమిటని మాస్టరూ అడగ్గా.. నా పేరు 'రామోజీ రావు' అని చెప్పారు. రామయ్య అనే పేరు పాతదిగా ఉండటంతో తన పేరును విలక్షణంగా, సృజనాత్మకతంగా ఉండే విధంగా రామోజీగా మార్చుకున్నారు. రామోజీ తన పేరు మార్చుకోవటం చూసి ఇంట్లో అంతా ఆశ్చర్యపోయారు. రామోజీ రావు ప్రతిభకు చూసి మురిసిపోయారు.

**వరించిన పలు పురస్కారాలు**

వరించిన పలు పురస్కారాలురామోజీ రావు పలు పురస్కారాలు అందుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీశ్రీ రవిశంకర్ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్లు అందించాయి. యుధవీర్ అవార్డు. కెప్టెన్ దుర్గాప్రసాద్ చౌదరి (రాజస్థాన్) అవార్డు, బి. డి. గోయెంకా అవార్డు, 2016లో పద్మవిభూషణ్ అందుకున్నారు. ఇలా అతి సామాన్యుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన రామోజీ రావు అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర వేసి అత్యంత శక్తివంతుడిగా మారారు.

# తెలంగాణ ప్రజలకు గుడ్ న్యూస్...

- ఆరోగ్యశ్రీలో మరికొన్ని సేవలు
- కొత్తగా మరో 65 చికిత్సలు
- అదనంగా రూ.497.29 కోట్లు విడుదల
- ప్రకటించిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క




**విశ్వంభర, హైదరాబాద్:** గుండె సమస్యల నిర్ధారణకు నిర్వహించే యాంజియోగ్రామ్ పరీక్షతో పాటు పార్కిన్ సన్, వెన్నుముక వంటి ఖరీదైన వ్యాధులను కూడా ఆరోగ్య శ్రీలో చేర్చుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. కొత్తగా ఆరోగ్యశ్రీలో మరో 65 కొత్త చికిత్స విధానాలను అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం వెల్లడించారు. అంతేకాకుండా వీటితోపాటు ఆరోగ్య శ్రీలో ప్రస్తుతం ఉన్న 1672 చికిత్స విధానాల్లో 1375 ప్రోసీజర్లకు ప్యాకేజీ ధరలు పెంచారు. ఇందుకు అదనంగా మరో వీటికి సంబంధించి రూ.497.29 కోట్లు అవసరం కాగా, ఈ నిధులను విడుదల చేసినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. తెలంగాణలో ఆరోగ్య శ్రీ పథకం కింద 2.84 కోట్ల లబ్ధిదారులు ఉండగా, వీరికి ఈ స్కీమ్ ద్వారా రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతుంది. తెలంగాణలో 1402 ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందుతున్నాయి.

# అంతర్జాతీయ స్థాయిలో బుద్ధవనం అభివృద్ధి

- ఆధ్యాత్మిక డెస్టినేషన్ సెంటర్‌గా తీర్చిదిద్దుతాం
- మంత్రి జూపల్లి కృష్ణారావు
- హిల్ కాలనీలోని బుద్ధవనం సందర్శన



**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో నాగార్జునసాగర్ బుద్ధవనాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక డెస్టినేషన్ సెంటర్ గా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. యావత్ భారతదేశంతోపాటు ప్రపంచానికి బౌద్ధ వారసత్వం, సంస్కృతిని చాటి చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. 2024, జూన్ 8వ తేదీ శనివారం నాగార్జున సాగర్ లోని హిల్ కాలనీలో ఉన్న బుద్ధవనాన్ని మంత్రి జూపల్లి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. బౌద్ధ టూరిజం సర్క్యూట్‌లో తెలంగాణలోని బుద్ధవనాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని చెప్పారు. టూరిజం ప్రమోషన్‌లో భాగంగా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించామని మంత్రి తెలిపారు. బుద్ధుడి సమగ్ర జీవిత చరిత్రను ఒకే ప్రదేశంలో ఆవిష్కరించేలా నాగార్జునసాగర్‌లో ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాన్ని గొప్పగా నిర్మించారని కొనియాడారు. ఆచార్య నాగార్జునుడు నడయాడిన ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రజలు తప్పక సందర్శించాల్సిన ప్రాంతం బుద్ధవనమని చెప్పారు. నాగార్జున సాగర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం వల్ల ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి జూపల్లి తెలిపారు.

# మోడీ.. రాజీనామా చేస్తారా?



**విశ్వంభర, ఢిల్లీ:** ప్రధాని మోడీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మోదీ చేసిన వ్యాఖ్యలకు శనివారం ఢిల్లీ వేదికగా ఆయన స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. "తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారు కానీ అక్కడి ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్ తొందరగా కోల్పోయింది.. అందుకే ప్రజలు ఎన్డీఏ వైపు మొగ్గు చూపారు" అంటూ మోడీ చేసిన కామెంట్స్ పై సీఎం రేవంత్ స్పందించారు. శనివారం ఢిల్లీలో జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశానికి వెళ్లిన సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో బీజేపీ గవర్నమెంట్ ఉంది కానీ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఇచ్చారు. తక్కువ సీట్లు వచ్చాయని అక్కడ రాజీనామా చేస్తారా అంటూ మోడీని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో మోడీ గ్యారంటీకి వారంటీ అయిపోయింది అంటూ కౌంటర్ ఇచ్చారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ బలహీనపడిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. "ప్రజలు ఇచ్చిన తీర్పు స్పష్టంగా అర్ధమైంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ బలం పెరిగింది. యూపీలో బీజేపీని ప్రజలు తిప్పికొట్టారు. 2023 శాసనసభ ఎన్నికల్లో 39.5శాతం ఓట్లతో ప్రజాపాలనకు ప్రజలు ఆమోదం తెలిపారు. వందరోజుల్లో 5 గ్యారంటీలను అమలు చేసి పార్లమెంట్ ఎన్నికల బరిలో దిగాం. ఈ ఎన్నికలు మా వంద రోజుల ప్రజా పాలనకు రెఫరెండం అని ముందే విస్పష్టంగా చెప్పాము. 17 పార్లమెంట్ స్థానాల్లో 8 స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లో 41 శాతం ఓట్లు కాంగ్రెస్ కి వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మాకు 39.5శాతం ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో మా ఓట్ల శాతం పెరిగింది. మా పరిపాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఈ ఫలితాలతో అర్థమవుతోంది. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలిపించి ప్రజలు మాకు మరో సీటు అదనంగా ఇచ్చారని" సీఎం రేవంత్ అన్నారు.

# రాకేశ్ రెడ్డీ.. మీరు కష్టపడ్డారు

(మొదటి పేజీ తరువాయి)



'రాకేశ్ రెడ్డి మీరు సాధ్యమైనంతగా కష్టపడ్డారు. ఫలితాలు ఎప్పుడూ కూడా ఆశించినట్లుగా ఉండవు. దృఢంగా, పాజిటివ్‌గా ఉండండి. ఇదే కష్టాన్ని కొనసాగిద్దా'మని కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అంతకుముందు రాకేశ్ రెడ్డి తనకు అవకాశమిచ్చిన కేసీఆర్‌కు, తనకు మద్దతుగా ఓటేసిన పట్టభద్రులకు ధన్యవాదాలు చెబుతూ ట్వీట్ చేశారు. అందరి అంచనాలకు తగినట్లు భవిష్యత్తులో రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తానని పేర్కొన్నారు. ఇప్పుడు మాత్రం అంచనాలు అందుకోలేకపోయినందుకు క్షమించాలన్నారు. పార్టీలోకి వచ్చిన అతితక్కువ సమయంలో తనను గుండెలకు అద్దుకున్న బీఆర్ఎస్ శ్రేణులకు, పార్టీలకు అతీతంగా తనకు అండగా నిలిచిన ప్రతీ ఒక్కరికీ నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. భవిష్యత్తులో పార్టీ శ్రేయస్సు కోసం, ప్రజల కోసం, పట్టభద్రుల కోసం తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. మీ అందరికీ మాట ఇచ్చినట్లుగా... ఎమ్మెల్సీగా చట్టసభలో అడుగుపెట్టలేకపోయినప్పటికీ, ప్రజాసభలో నిత్యం ప్రజల పక్షాన కొట్లాడుతూనే ఉంటానన్నారు. ఈ ఓటమి తాత్కాలికమే... భవిష్యత్తు గెలుపుకు బాటలు వేస్తూ నిబ్బరంగా సాగుదామన్నారు.

**'నీట్' అవకతవకలపై విచారణ జరిపించాలి**

కేంద్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న ఎన్డీయే ఎదుట ఎన్నో సవాళ్ళున్నాయని... కానీ లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన 'నీట్' అంశంపై వెంటనే స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. లక్షలాది మంది వైద్య విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే నీట్ ఎగ్జామ్‌కు సంబంధించి కొన్ని వ్యవహారాలు చూస్తుంటే కచ్చితంగా అవకతవకలు జరిగినట్లు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం నీట్ పరీక్షల్లో 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించటం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనికి తోడు ఈసారి చాలామంది విద్యార్థులు 718, 719 మార్కులు సాధించారని తెలిపారు. నీట్‌లో (+4, 1) మార్కింగ్ విధానం ఉంటుందని... ఈ లెక్కన 718, 719 మార్కులు రావడం సాధ్యమయ్యే పని కాదన్నారు. దీని గురించి ప్రశ్నిస్తే 'గ్రేస్ మార్కులు' ఇచ్చామని చెబుతున్నారని... కొంతమంది విద్యార్థులకు 100 వరకు గ్రేస్ మార్కులు ఇచ్చినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. గ్రేస్ మార్కుల కోసం ఏ విధానం అవలంబించారన్నది చెప్పకపోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. నీట్ ఫలితాలను ప్రీపోన్ చేసి ఎన్నికల ఫలితాల రోజే హడావుడిగా విడుదల చేయటం కూడా ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. కొత్తగా ఏర్పడిన ఎన్డీయే సర్కార్ రానున్న రోజుల్లో ఇలాంటి సమస్యలకు సంబంధించి చాలా సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అయితే నీట్ ఎగ్జామ్ విషయంలో బీఆర్ఎస్ తరపున పలు ప్రశ్నలతో పాటు కొన్ని డిమాండ్లను కేంద్రం ముందు ఉంచుతున్నట్లు తెలిపారు.

# రామోజీరావు అస్తమయం.. చంద్రబాబు ఎమోషనల్ ట్వీట్

**విశ్వంభర, హైదరాబాద్ :**



ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మృతి పట్ల టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. రామోజీరావు అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని పేర్కొన్నారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన శ్రీ రామోజీరావు మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసిందని తెలిపారు. అక్షర యోధుడుగా శ్రీరామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి ఎన్నో సేవలు అందించారని, తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్రవేశారని కొనియాడారు. శ్రీ రామోజీ తెలుగు ప్రజల ఆస్తిగా అభివర్ణించారు. ఆయన మరణం తెలుగు ప్రజలకే కాదు.. దేశానికి కూడా తీరని లోటని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సమాజ హితం కోసం అనుక్షణం పనిచేసిన ఆయన కీర్తి అజరామరమని కీర్తించారు. ఈనాడు గ్రూపు సంస్థల స్థాపనతో వేల మందికి ఉపాధి కల్పించారని, మీడియా రంగంలో రామోజీది ప్రత్యేకమైన శకమని పునరుద్ఘాటించారు. ఎన్నో సవాళ్లను, సమస్యలను అధిగమించి ఎక్కడా తలవంచకుండా రామోజీరావు విలువలతో సంస్థలను నడిపిన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. దశాబ్దాల తన ప్రయాణంలో అనుక్షణం ప్రజల మంచి కోసం, సమాజ హితం కోసం పనిచేశారని, మీడియా రంగంలో ఆయనొక శిఖరమని పేర్కొన్నారు. ఆయన ఇక లేరనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. రామోజీరావుతో తనకు నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందని, మంచిని మంచి, చెడును చెడు అని చెప్పే ఆయన తీరు తనను ఆయనకు దగ్గర చేసిందని వెల్లడించారు. సమస్యలపై పోరాటంలో ఆయన తనకెంతో స్ఫూర్తి అని చంద్రబాబు తెలిపారు. ప్రజలకు మంచి పాలసీలు అందించే విషయంలో రామోజీ సూచనలు, సలహాలు ఎప్పుడూ ఉన్నతంగా ఉండేవని, ఆయన అస్తమయంపై వారి కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని చంద్రబాబు ట్వీట్‌లో పేర్కొన్నారు.



# ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తాం

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

పత్రికలు ప్రచార సాధనాలు కూడా ప్రతిపక్షాలుగా ప్రధాన పాత్ర పోషిస్తాయని నిరూపించిన వ్యక్తి రామోజీరావు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా సమస్యలను లేవనెత్తి పాలకుల నుంచి వాటిని పరిష్కరించడానికి పోరాడిన వ్యక్తి అని పేర్కొన్నారు. రామోజీ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాంటి మహనీయుడికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపి సత్కరించుకుంటామని వెల్లడించారు. ఆయన మరణం పత్రికా రంగానికి తీరని లోటు అని స్తుతించారు. "రామోజీరావు దేశ రాజకీయాల్లో, పత్రిక, ప్రసార రంగంలో దేశానికి ఆదర్శంగా నిలబడి పత్రికలు ప్రతిపక్ష సాధనలు పాత్ర పోషిస్తాయని నిరూపించారు. వ్యాపారంలో, ప్రజాసేవలో ప్రజా సమస్యలను లేవనెత్తి పాలకుల నుంచి ప్రజలకు మేలు జరిగేలా పోరాటం చేసిన వ్యక్తి రామోజీరావు." అని

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.**



"సమాజహితం కోసమే అనునిత్యం కష్టపడ్డారు. తెలుగుజాతి కోసం అహర్నిశలు పనిచేశారు. రామోజీరావు ఒక వ్యక్తి కాదు, వ్యవస్థ అని. చిత్రపరిశ్రమకు ఎనలేని సేవలు చేశారు. ధర్మం ప్రకారం పనిచేస్తానని రామోజీరావు స్పష్టంగా చెప్పేవారు. రామోజీరావు నిర్మించిన వ్యవస్థలు శాశ్వతం. అత్యున్నత ప్రమాణాలతో రామోజీ ఫిలింసిటీ స్థాపించారు. రామోజీరావు తన జీవిత కాలంలో విశ్వసనీయత సంపాదించారు. తెలుగుజాతిని ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేశారు. ఏపీ భివృద్ధికి ఆయన ఇచ్చిన స్ఫూర్తితో ముందుకెళ్తాం. రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను."

**- చంద్రబాబు, టీడీపీ అధినేత**

# రామోజీ అంటే క్రమశిక్షణ, నిబద్ధత: వెంకయ్య నాయుడు

**విశ్వంభర, హైదరాబాద్:** ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు కొన్ని గంటల క్రితమే కన్నుమూశారు. పచ్చళ్లు అమ్ముకునే స్థాయి నుంచి మీడియా మొఘల్ దాకా ఎదిగారు ఆయన. అనేక రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించి.. తనకు సక్సెస్ తప్ప ఇంకోటి తెలియదన్నట్టు ఎదిగారు. అంతటి ఘనుడు.. అనారోగ్యం కారణంగా కన్నుమూశారు. దాంతో ఆయనకు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటిస్తున్నరు. ఈ క్రమంలోనే తాజాగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సంతాపం తెలిపారు. అక్షర యోధుడు రామోజీరావు కన్నుమూయడం తెలుగు ప్రజలకు తీరనిలోటు అని తెలిపారు. రామోజీరావు అంటూ క్రమశిక్షణ, నిబద్ధత, సమయపాలన అని తెలిపారు. అందుకే ఆయన అన్ని రంగాల్లోనూ విజయం సాధించినట్టు తెలిపారు. అలాంటి వ్యక్తి తెలుగు ప్రజల ఆస్తి అని.. ఆయన తెలుగు ప్రజలకు గర్వకారణం అంటూ కొనియాడారు వెంకయ్య నాడు.





## చికిత్స పేరుతో డాక్టర్ల దారుణాలు..

- తనిఖీల్లో సంచలన నిజాలు..!

**విశ్వంభర, మరిపెడ:** ఈ రోజుల్లో వైద్యం వ్యాపారం అయిపోయింది. అమాయక ప్రజల ప్రాణాలతో కొందరు చెలగాటం ఆడుతున్నారు. కొందరు అయితే అర్హత లేకున్నా సరే ఫేక్ సర్టిఫికెట్లు పెట్టుకుని ఆస్పత్రుల పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పుడు మహబూబాబాద్ జిల్లాలో అర్హత లేకుండా నిర్వహిస్తున్న నాలుగు ప్రైవేట్ ఆస్పత్రులపై దాడులు నిర్వహించారు. అర్హత లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్న నాలుగు క్లినిక్ లపై ఎన్.ఎం.సీ చట్టం 34, 54 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మరిపెడ మండలంలో కొందరు ఆస్పత్రులను పెట్టుకుని అర్హత లేకున్నా డాక్టర్లుగా చెలామణి అవుతున్నారని వారి దృష్టికి వచ్చింది.ఈ నేపథ్యంలో వారు తనిఖీలు చేయగా సంచలన విషయాలు వెల్లడయ్యాయి. రామారావు క్లినిక్, శ్రీనివాస ప్రథమ చికిత్స కేంద్రం, బీవీ నాయక్ ఫస్ఎయిడ్ సెంటర్ నిర్వాహకులు రామారావు, బీవీ నాయక్, ఇస్లావత్ వీరన్నను నకిలీ డాక్టర్లుగా గుర్తించారు. వీరి ఆస్పత్రులను మూసేసి అందరిపై కేసులు నమోదు చేశారు.



## ఒత్తిళ్లకు గురికాకుండా పరీక్ష రాయండి

### సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రూప్–1 ప్రిలిమినరీ ఎగ్జామ్ రాసే అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని తెలంగాణ CMO ట్వీట్ చేసింది. ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా పరీక్ష రాయాలని తెలిపారని, అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారని పేర్కొంది. కాగా ఉదయం 10 గంటలలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని టీజీపీఎస్సీ సూచించింది. రేపు జరిగే పరీక్ష కోసం 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.ఓఎంఆర్ విధానంలో రాత పరీక్ష నిర్వహించనున్నారు. అయితే హాల్ టికెట్‌పై లేటెస్ట్ పాస్ ఫొటో తప్పనిసరిగా అతించుకోని వెళ్లాలి. అంటే 3 నెలల క్రితం నుంచి నేటి వరకు దిగిన పాస్ ఫొటో తప్పనిసరి. హాల్ టికెట్‌పై అభ్యర్థి తన ఫొటో పేస్ట్ చేయకపోతే ఎగ్జామ్ సెంటర్‌లోకి అనుమతించరు అని స్పష్టం చేసింది. ఈ నిబంధనను హాల్ టికెట్‌లో పొందుపరిచినట్లు టీఎస్‌పీఎస్సీ అధికారులు తెలిపారు. ఫొటో కింద సంతకం చేసేందుకు తప్పనిసరిగా స్పేస్ ఉంచుకోవాలని ,హాల్ టికెట్‌తో పాటు పాస్ పోర్ట్, ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు,పాన్ కార్డు, గవర్నమెంట్ ఎంప్లాయ్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఒరిజినల్ కార్డును పరీక్షా కేంద్రం వద్ద చూపిస్తేనే లోపలికి అనుమతిస్తారు.ల



## కంగనా చెంపపై కొట్టిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌కు బంగారు కానుక

**విశ్వంభర, చండీగఢ్:** ఇటీవల చండీగఢ్ ఎయిర్ పోర్టులో సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్ బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చెంపపై కొట్టడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. గతంలో కంగనా రైతులపై చేసిన అవమానకర వ్యాఖ్యలకు బదులు తీర్చుకునేందుకే తాను ఆమె చెంపపై కొట్టానని ఆ కానిస్టేబుల్ వెల్లడించింది. కంగనా ఫిర్యాదు నేపథ్యంలో, కుల్వీందర్ ను సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు విధుల నుంచి సస్పెండ్ చేశారు. అయితే, కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్ కు రైతు సంఘాలు మద్దతుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, తమిళనాడులోని తంతై పెరియార్ ద్రవిడర్ కళగం (టీపీడీకే) పార్టీ కుల్వీందర్ కౌర్ కు ఓ బంగారు ఉంగరాన్ని కానుకగా పంపాలని నిర్ణయించింది. ఆ ఉంగరంపై పెరియార్ ముఖచిత్రం ముద్రించి పంపిస్తామని టీపీడీకే ప్రధాన కార్యదర్శి రామకృష్ణన్ వెల్లడించారు. ఈ బంగారు ఉంగరం బరువు 8 గ్రాములు ఉంటుందని తెలిపారు. సోమవారం నాడు కుల్వీందర్ కౌర్ చిరునామాకు ఉంగరాన్ని కొరియర్ సర్వీస్ ద్వారా పంపుతామని, ఒకవేళ బంగారు ఉంగరం కొరియర్ లో పంపేందుకు అనుమతి లేకపోతే, తమ పార్టీ సభ్యుల్లో ఒకరిని విమానంలో కానీ, రైల్లో కానీ కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్ స్వస్థలానికి పంపించి బంగారు ఉంగరంతో పాటు, పెరియార్ గురించి కొన్ని పుస్తకాలు కూడా అందజేస్తామని రామకృష్ణన్ వివరించారు.

# శాఖల నిర్ణయం మోడీకే..
# చంద్రబాబు కీలక నిర్ణయం..

- టీడీపీకి ఏ శాఖ ఇవ్వాలన్నా మోడీ చేతిలోనే
- కీలక శాఖలే ఇస్తారని భావిస్తున్న టీడీపీ



**విశ్వంభర, విశాఖపట్నం:** కేంద్రంలో ఇప్పుడు ఎన్డీయే సర్కార్ అధికారంలోకి వచ్చింది. అయితే ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటులో ఇప్పుడు చంద్రబాబు కీలకంగా మారిపోయారు. ఆయన వల్లే మోడీ మూడోసారి ప్రధాని కాబోతున్నారు. దీంతో ఇప్పుడు చంద్రబాబుకు కేంద్రంలో కీలక పాత్ర లభించబోతోందని తెలుస్తోంది. ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీకి కనీసం మూడు కేంద్ర మంత్రి పదవులు ఉంటాయని తెలుస్తోంది. అయితే ఇందులో భాగంగా కేంద్ర మంత్రి శాఖలను మాత్రం మోడీకే వదిలేస్తున్నారంట చంద్రబాబు. టీడీపీకి ఏ మంత్రి శాఖలను ఇవ్వాలనేది మోడీ నిర్ణయానికే వదిలేస్తున్నామని చంద్రబాబు ఇప్పటికే ఎన్డీయే పెద్దలకు తెలియజేశారంట.మోడీ కూడా చంద్రబాబు ప్రాధాన్యతను తగ్గించకుండా.. కీలక శాఖలే ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఈ సారి బీజేపీకి సొంతంగా మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో ఎన్డీయే మిత్రపక్షాలకు డిమాండ్ పెరిగింది. అందుకే మోడీ మిత్ర పక్షాల డిమాండ్లకు తలొగ్గాల్సిన పరిస్థితి వచ్చిందని అంటున్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ భారీ స్కామ్..

### ఆధారాలతో బయటపెట్టిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



**విశ్వంభర, హుజురాబాద్ :** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో వందల కోట్ల స్కామ్ జరుగుతుందని ఆరోపించారు. వే బిల్లులు లేకుండా అధిక లోడుతో బూడిద లారీలు వెళ్తున్నాయని ఆధారాలతో సహా చూపించారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. వే బిల్లలు లేకుండా అధిక లోడుతో బూడిద లారీ ఎందుకు వెళ్తున్నాయని ప్రశ్నించారు. రామగుండం ఎన్టీపీసీ నుంచి హుజురాబాద్ మీదుగా ఎలాంటి వే బిల్లులు లేకుండా అధిక లోడుతో లారీలు వెళ్తున్నాయని ఆరోపించారు. సుమారు 300 లారీలు నిబంధనలకు విరుద్ధంగా వెళ్తున్నా ప్రభుత్వ అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ఇదంతా రాష్ట్ర రావాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపించారు. మంత్రికి లారీ యజమానుల నుంచి రోజుకు రూ.50లక్షల చొప్పున అందుతున్నాయన్నారు. ఇప్పటికే రూ.100కోట్ల వరకు వెళ్లాయని వెల్లడించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ పొన్నం ప్రభాకర్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

# చేప మందు పంపిణీలో విషాదం



**విశ్వంభర, నాంపల్లి :** నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న చేప ప్రసాదం పంపిణీలో విషాదం చోటుచేసుకుంది. క్యూ లైన్‌లో నిలబడిన ఓ వ్యక్తి తోపులాటలో సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తిగాపోలీసులు గుర్తించారు. మృగశిర కార్తె సందర్భంగా ఆస్తమా బాధితులకు ఈ చేప మందు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏటా ఈ కార్యక్రమానికి ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివస్తున్నారు. వారి కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రెండ్రోజుల ముందే చేప మందుకోసం చాలామంది నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంకు చేరుకుని షెడ్లలో బస చేశారు. శనివారం ఉదయం 9గంటలకు ప్రారంభమైంది. అయితే కొన్నిగంటల్లో ఈ విషాదం చోటు చేసుకుంది. ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న చేప ప్రసాదం పంపిణీలో విషాదం చోటుచేసుకుంది. క్యూ లైన్‌లో నిలబడిన ఓ వ్యక్తి తోపులాటలో సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తిగాపోలీసులు గుర్తించారు.

# అసెంబ్లీలో జగన్ వాయిస్ వినిపించదా..!



**విశ్వంభర, తాడేపల్లిగూడెం:** వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మొన్నటి వరకు తిరుగులేని మెజార్టీతో అధికారంలో ఉన్నారు. అసెంబ్లీ నిండా ఆయన ఎమ్మెల్యేలే కనిపించేవారు. అంతటి పవర్ ను అనుభవించిన ఆయనకు.. ఇప్పుడు దారుణమైన పరిస్థితులు వచ్చాయి. మొన్నటి ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం అయి వైసీపీ దారుణమైన ఫలితాలను మూటగట్టుకుంది. అయితే ఇప్పుడు ఏపీలో 175 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అందులో ప్రధాన ప్రతిపక్ష హోదా రావాలంటే 18 ఎమ్మెల్యే సీట్లు కావాలి. గతంలో చంద్రబాబుకు 23 మంది ఎమ్మెల్యేలు గెలచుకున్నారు. కానీ అందులో నలుగురు వైసీపీలో చేరడంతో 19 మందితో ప్రధాన ప్రతిపక్ష హోదాను దక్కించుకున్నారు. కానీ ఇప్పుడు జగన్ కు ఆ పరిస్థితి లేదు. దాంతో అసెంబ్లీలో ఆయన ప్రాధాన్యత తగ్గిపోతుంది. ప్రధాన ప్రతిపక్ష నేతకు కేబినెట్ హోదా ఉంటుంది. పిఎస్, పిఏ తో పాటు సిబ్బంది అలవెన్సులు కూడా ఉంటాయి. కానీ ఇప్పుడు జగన్ ఎక్కడ కూర్చోవాలో కూడా స్పీకర్ నిర్ణయిస్తారు. అంతే కాకుండా అసెంబ్లీలో మాట్లాడేందుకు జగన్ కు ప్రాధాన్యం తగ్గిపోతుంది. రూల్స్ ప్రకారం నిమిషాల కంటే ఎక్కువగా మాట్లాడటానికి జగన్ కు అవకాశం ఉండదు.

## భారత్ ఆల్ టైమ్ రికార్డ్..

# భారీగా పెరిగిన విదేశీ మారక ద్రవ్య నిల్వలు



**విశ్వంభర, ముంబై:** భారత విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఆల్ టైమ్ రికార్డ్ సాధించాయి. తొలిసారిగా 650 బిలియన్ డాలర్ల మార్కును అధిగమించి రికార్డు నెలకొల్పాయి. మే 31 నాటికి భారతదేశ ఫారెక్స్ నిల్వలు 651.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఆ వారంలో 4.8 బిలియన్ డాలర్ల ఫండ్ పెరుగుదల కనిపించింది. ఫారెక్స్ ఫండ్ మునుపటి వారంలో 2 బిలియన్ డాలర్లు తగ్గింది. మే 31తో ముగిసిన వారంలో కొత్త రికార్డు గరిష్ఠ స్థాయికి చేరింది. మానిటరీ పాలసీ కమిటీ మూడు రోజుల సమావేశం అనంతరం ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫారెక్స్ నిల్వలు పెరిగాయని, ఫారెక్స్ ఫండ్ పెరుగుదలకు సంబంధించిన సమాచారాన్ని ఆర్‌బిఐ ఈ సాయంత్రం ప్రచురించనున్నట్లు తెలిపారు. మే 24తో ఫారెక్స్ లిక్విడిటీ ఫండ్ 646.673 బిలియన్ డాలర్లుగా ఉంది. అంటే దాదాపు రూ.53.7 లక్షల కోట్ల ఫారెక్స్ నిధులు ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ బాహ్య కారకాల ప్రభావం లేకుండా పటిష్టంగా అభివృద్ధి చెందిందని భారత ఆర్థిక వ్యవస్థపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఆర్‌బీఐ ఆరుగురు సభ్యుల ఎంపీసీ సమావేశం రెపో రేటును నిర్ణయించింది. 6.50కి కొనసాగించాలనే నిర్ణయానికి 4:2 మద్దతు లభించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జడీపీ 7.2శాతం పెరగవచ్చని అంచనా వేసింది ఆర్‌బీఐ. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు బాగా కురుస్తాయని, ఫలితంగా ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉందని ఆర్‌బీఐ ఆశాజనకంగా ఉంది.



## మీడియా దిగ్గజం రామోజీ రావు

**విశ్వంభర, హైదరాబాద్ :** చెరుకూరి రామోజీరావు (1936 నవంబరు 16 – 2024 జూన్ 8), ఒక వ్యాపారవేత్త, ఈనాడు గ్రూపు సంస్థల అధినేత. తెలుగు దినపత్రిక ఈనాడుకు వ్యవస్థాపకుడు, ప్రధాన సంపాదకుడు, ప్రచురణ కర్త. మార్గదర్శి చిట్‌ఫండ్, ప్రియా ఫుడ్స్, కళాంజలి మొదలగు వ్యాపార సంస్థల అధినేత. రామోజీరావు స్థాపించిన రామోజీ గ్రూపు ఆధీనంలో ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీ ఉంది. 2016లో భారత ప్రభుత్వం అతనిని దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్ తో సత్కరించింది.

**ఈనాడు అధిపతి రామోజీరావు**

| | |
|---|---|
| పేరు | చెరుకూరి రామయ్య |
| జననం | 1936 నవంబరు 16, గుడివాడ, కృష్ణా జిల్లా |
| మరణం | 2024 జూన్ 8 (వయసు 87) |
| నివాస ప్రాంతం | హైదరాబాద్ |
| ఇతర పేర్లు | రామోజీ |
| పత్రికా సంపాదకుడు, ప్రచురణకర్త, చిత్ర నిర్మాత | |

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు హఠాత్ మరణంతో ప్రముఖ రాజకీయ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తోపాటు పలువురు మంత్రులు సంతాపం ప్రకటించిన వారిలో ఉన్నారు. తెలంగాణ మొట్టమొదటి అసెంబ్లీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, రంగారెడ్డి జిల్లా రైతుబంధు మాజీ చైర్మన్, ఉద్యమనాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్, ప్రకాష్ గౌడ్ నివాళులర్పించారు.

### ఆయన మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు

**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు మరణం తెలుగు జాతికి తీరని లోటని మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి అన్నారు. రామోజీ ఫిలిం సిటీ లోని ఆయన భౌతికాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మంత్రి వెంట తెలంగాణ ఫిలిం ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ కేఎల్ఎన్ ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

### తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది

**-మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



ప్రజల్లో మీడియా పట్ల సానుకూల దృక్పథాన్ని పెంచిన అక్షర శిల్పి. "తెలుగు – వెలుగు" తో అమ్మ భాషకు వన్నె తెచ్చేందుకు విశేష కృషి చేసిన భాషాభిమాని రామోజీ రావు అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆయన ఏ రంగంలో ఉన్నా, అత్యున్నత ప్రమాణాలు నిర్దేశించుకున్నారని . ఎంచుకున్న రంగాల్లో విలువలకు, విశ్వసనీయతకు పెద్దపీట వేశారని తెలియజేసారు . సంకల్పం ఉంటే జీవితంలో ఏదైన సాధించవచ్చని నిరూపించిన జీవితపాఠం రామోజీరావు అని గుర్తు చేసుకున్నారు. ఈనాడు, ఈటీవీ తో తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ... ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నానని వారితో దిగిన ఫోటో ని షేర్ చేశారు.

### మీడియా రంగంలో చెరగని ముద్ర

**-సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



మీడియా, సినిమా రంగాలలో తనదైన చెరగని ముద్ర వేసిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆయన మృతి వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామోజీరావు తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సాధారణ వ్యక్తిగా జీవనం ప్రారంభించి స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదుగుతూ అతిపెద్ద వ్యాపారవేత్త గా ఎదిగారు. తాను ఏర్పాటు చేసిన వివిధ సంస్థల ద్వారా లక్షలాదిమంది కి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని అన్నారు. ఈనాడు పత్రిక ద్వారా అనేక వాస్తవాలను వార్తల రూపంలో తీసుకొచ్చి తెలుగు ప్రజల మనసుల్లో నిలిచిపోయారని అన్నారు. ప్రపంచంలోని తెలుగు ప్రజలంతా గర్వపడే విధంగా ఎంతో అద్భుతమైన ఫిల్మ్ సిటీని తీర్చుదిద్దిన ఘనత కూడా రామోజీరావు కే దక్కుతుందని తెలిపారు.

### నివాళులర్పించిన మధుయాష్కి గౌడ్



రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మరణం పట్ల టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. శనివారం సాయంత్రం రామోజీ ఫిలిం సిటీకి వెళ్లిన మధుయాష్కి.. రామోజీ భౌతిక ఖాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామోజీరావు గారి మరణవార్త తనకు దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ప్రపంచంలోని ప్రఖ్యాత యూనివర్సిటీలకు దీటుగా.. రామోజీ ఫిలిం సిటీని నిర్మించటం ద్వారా భారతదేశం కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. తన జీవితంలో అనేక ఒత్తిడి లను, ఎన్నో ఆటుపోట్లను చూశారని, కానీ ఏనాడూ ఎవరికీ తలొగ్గకుండా లక్ష్యం వైపు ముందుకెళ్లారన్నారు. పత్రికా, మీడియా రంగంతో పాటు సినీ, వ్యాపార రంగాలలో ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు.



## రామోజీరావు ఆశయాలు స్ఫూర్తిదాయకం

- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

విశ్వంభర, హైదరాబాద్ : రామోజీరావు ఆశయాలు, ఆలోచనలు స్ఫూర్తిదాయకమని మాజీమంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఫిలింసిటీలో రామోజీరావు భౌతిక కాయానికి పూలువేసి నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తెలుగు పత్రికారంగం, ప్రసార మాధ్యమాల్లో విప్లవాత్మక మార్పులకు బీజం వేసిన మహనీయుడు రామోజీరావు అని కొనియాడారు. విలువలతో కూడిన జర్నలిజానికి చిహ్నంగా రామోజీరావు తెలుగు ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోతారని అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి నిరంతరం ఆయన తపనపడేవారని తెలిపారు. దేశం, రాష్ట్రం బాగుండాలని కోరుకునే వ్యక్తి రామోజీరావు అని కేటీఆర్ అన్నారు. భవిష్యత్తు గొప్పగా ఎలా ఉండాలో కలిసినప్పుడల్లా చెప్పేవారని గుర్తుచేసుకున్నారు. ఆయన ఒక మొబైల్ ఎన్‌సైక్లోపిడియాలా మాట్లాడేవారని అభివర్ణించారు. రామోజీరావు మృతి తెలుగు పత్రికా రంగంతో పాటు ప్రపంచంలోని తెలుగువారందరికీ తీరని లోటని అన్నారు.

# సుదీర్ఘ రాజకీయ అనుభవశాలి ఆచార్య రంగా

## నేడు ఆచార్య ఎన్జీ రంగా వర్ధంతి






గోగినేని రంగనాయకులు... ఈ పేరు అంతగా ప్రాచుర్యం లేనిది. ఈ పేరు చెపితే దేశంలో గుర్తు పట్టే వారు దాదాపు ఉండక పోవచ్చు. ఆయన ఒక నిబద్ధత కలిగిన పాత తరం రాజకీయ నాయకులు. ఆయనను భారత రైతాంగ ఉద్యమపితగా భావిస్తారు.

సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన ప్రజాప్రతినిధి. లోక్‌సభలోనూ, ఇటు రాజ్యసభలోనూ 60 ఏండ్లు రైతుల పక్షాన పోరాడిన నాయకులు. రాజకీయ అవగాహన కలిగిన వారికి ఇప్పుడు ఆయనెవరో స్ఫురణకు వచ్చి ఉంటుంది. రైతాంగ విధానాలకు మద్దతు నిచ్చిన ఆయనే సుధీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న ఆచార్య ఎన్.జి.రంగా.

ఆచార్య రంగా (నవంబరు 7, 1900 నుంచి జూన్ 9, 1995) భారత స్వాతంత్ర్య సమర యోధులు, పార్లమెంటు సభ్యులు, రైతు నాయకుడు. 1935లో తొలిసారి కేంద్ర శాసనసభకు సభ్యులై అప్పటి నుంచి మరణించే వరకు నిరంతరం పార్లమెంటేరియన్ గానే కొనసాగారు.

రంగా, 1900, నవంబరు 7 న గుంటూరు జిల్లా నిడుబ్రోలులో గోగినేని నాగయ్య, అచ్చమాంబ దంపతులకు జన్మించారు. నిడుబ్రోలులో ప్రాథమిక విద్యను ముగించుకొని, గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కళాశాల నుంచి పట్టభద్రులైనారు. 1924లో భారతీ దేవితో రంగా వివాహం జరిగింది.

1926లో ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం నుంచి ఆర్ధ శాస్త్రంలో బీ లిట్ పొంది భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో ఆర్థిక శాస్త్ర ఆచార్యుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన ప్రధానంగా హేతువాది. 1930లో మహాత్మా గాంధీ పిలుపుకు స్పందించి రంగా భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. 1933లో రైతు కూలీ ఉద్యమానికి నేతృత్వం వహించారు. కిసాన్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. రైతుకూలీల పరిస్థితిపై గాంధీతో చారిత్రాత్మక చర్చలు జరిపారు. ఈ చర్చలలోని ముఖ్యాంశాలపై "బాపు దీవెనలు" అన్న పేరుతో రంగా ఒక పుస్తకాన్ని వెలువరించారు.

ఆంధ్రలో తొలిసారి రాజకీయ పాఠశాలలను ప్రారంభించిన ఖ్యాతి రంగాదే. నిడుబ్రోలులో రామనీడు పేరుతో రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేశారు. 1933వ సం.లో రంగా స్థాపించిన రాజకీయ విద్యాలయాన్ని మహాత్మాగాంధీ ప్రారంభించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రులు నారా చంద్రబాబు నాయుడు , కొణిజేటి రోశయ్య కూడా రంగా శిష్యులే. ఆ పాఠశాల గత మధుర స్మృతులకు సజీవ సాక్ష్యంగా నేటికి నిడుబ్రోలులో కొనసాగుతుంది. తొలి రాజకీయ పాఠశాలలో పుచ్చలపల్లి సుందరయ్యతో సహా కొందరు కమ్యూనిసులూ పాల్గొన్నారు. రంగా ఆంగ్లంలోను, తెలుగులోను మంచి రచయిత. 'హరిజన నాయకుడు' అనే నవల కూడా రాశారు. ఆంధ్ర రాజకీయాల్లో గాంధీ అనుచరుడిగా పట్టాభి సీతారామయ్య ఉండగా, రంగా గాంధీకి సన్నిహితుడు కాలేక పోయారు. అయినా పార్టీ సిద్ధాంత పరంగా గాంధేయుని గానే కొనసాగారు. సుభాస్ చంద్రబోస్ అంటే ఇష్టపడేవారు. 1937 నుంచి వాహిని అనే పత్రికను నడిపారు.

1938 నాటికే ఇందూలాల్ యాగ్నిక్‌తో కలిసి కిసాన్ సభలు నిర్వహించారు. ప్రకాశం పంతులుతో కలిసి ఆంధ్ర రాజకీయాల్లో కీలక పాత్ర వహించిన రంగాకు చాలా మంది శిష్యులు ఉండేవారు.

స్వాతంత్ర్య పోరాటంలో నిర్విరామంగా పాల్గొన్న రంగా అనేక పర్యాయాలు జైలు పాలయ్యారు. జైళ్ళలోకూడా రాజకీయ ఖైదీలకు పాఠశాలలు నిర్వహించారు. ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు.

మద్రాసు లోని పచ్చయప్పాస్ కళాశాలలో ఆర్థిక శాస్త్రాచార్యుడిగా చేరి నాలుగేళ్ళ పాటు ఉన్నప్పుడు రంగాకు విద్యార్థిగా అన్నాదొరై తమిళనాడు ముఖ్య మంత్రి) ఉండేవారు.

రంగా, అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరు. 1946లో కోపెన్ హేగెన్‌లో జరిగిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజెషన్ సదస్సులో 1948లో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక సంస్థ సదస్సులోనూ, 1952లో ఒట్టావాలో జరిగిన అంతర్జాతీయ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులోను, 1954లో న్యూయార్కులో జరిగిన ఇంటర్నెషనల్ పెజెంట్ యూనియన్, 1955లో టోక్యోలో జరిగిన ఆసియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంటు లోను భారత దేశం తరపున ప్రతినిధిగా పాల్గొన్నారు.

స్వాతంత్ర్యానంతరం తొలి ఎన్నికలు వచ్చేనాటికి ముఠా తగాదాల కారణంగా రంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి కృషీకార్ లోక్ పార్టీ స్థాపించారు. ఆ ఎన్నికలలో చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో మాత్రమే కృషీకార్ లోక్ పార్టీ అభ్యర్థులు గెలిచారు. తరువాత సహకార రంగ వ్యవసాయానికి బద్ధ వ్యతిరేకి అయిన రాజాజీతో కలిసి స్వతంత్ర పార్టీని స్థాపించారు. రంగా స్వతంత్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులై ఒక దశాబ్దం పాటు నిర్వహించారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో పార్టీ 25 స్థానాలలో గెలిచి బలమైన ప్రతి పక్షంగా రూపుదిద్దు కొన్నది. 1972లో రంగా తిరిగి కాంగ్రెస్ (ఐ)లో చేరి, ఇందిరా గాంధీకి సన్నిహితులై చివరి వరకూ కాంగ్రెస్ లోనే కొనసాగారు.

నెహ్రూ నాయకత్వాన్ని, ఆయన ప్రతిపాదించిన సహకార వ్యవసాయాన్ని కాదని దేశ వ్యాప్తంగా స్వతంత్ర పార్టీ ఏర్పడగా, దానికి తొలి అధ్యక్షుడిగా ఆచార్య రంగా ఉన్నారు. రాజగోపాలా చారి, మినూ మసానీ, పీలూ మోడీ, రత్నస్వామి, బెజవాడ రామచంద్రా రెడ్డి మొదలైనవారు ఎందరో రంగాతో చేతులు కలిపారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పడిన పార్టీలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కూడా తొలిదశలో ఉన్నారు. క్రమేణా స్వతంత్ర పార్టీకి రంగా దూరం అవుతూ వచ్చారు. జాతీయ నాయకులలో అంబేద్కర్‌తో రంగా సన్నిహితంగా ఉండేవారు. రాజ్యాంగ సభకు అంబేద్కర్ పేరును ప్రతిపాదించడంలో ఆయన కీలకపాత్ర వహించారు. ఆంధ్రలో సంస్కరణ వివాహాలను రంగా ప్రోత్సహించారు.

1952 నుంచి 62 వరకు తెనాలి, 62 నుంచి 67 వరకు చిత్తూరు, 67 నుంచి 70 వరకు శ్రీకాకుళం, 80 నుంచి 91వరకు మూడుసార్లు వరుసగా గుంటూరు లోకసభ నియోజకవర్గ స్థానాలకు ప్రాతినిథ్యం వహించారు.

1946లో కోపెన్ హేగన్‌లో జరిగిన వ్యవసాయ సమాఖ్యలో పాల్గొన్నారు. 1952లో కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొని అటావా నగరంలో ప్రసంగించారు. 1954లో న్యూయార్క్‌లో జరిగిన అంతర్జాతీయ రైతు సమాఖ్యలో ప్రధానోపన్యాసం చేశారు. 1955లో టోక్యోలో జరిగిన 'ఏషియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంట్' సభలో సుదీర్ఘోపన్యాసం చేశారు. రైతు సమస్యల్ని అంతర్జాతీయ సభల దృష్టికి తీసుకువచ్చారు. పొగాకు, పత్తి రైతుల, చేనేత కార్మికుల సమస్యలకు అధిక సమయాన్ని వినియోగించారు. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ పుంఖానుపుంఖంగా రచనలు చేశారు. రైతులు విప్లవోద్యమాలలో నిర్వహించిన పాత్రను అధ్యయనం చేసి రివల్యూషనరీ పెజంట్స్, ది క్రెడో ఆఫ్ వరల్డ్ పెజంట్స్ అనే గ్రంథాలు రాశారు.

రంగా సుదీర్ఘ కాలం పార్లమెంట్ సభ్యుడిగా రికార్డు సృష్టించి, గిన్నీస్ బుక్‌లోకి ఎక్కారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎలాంటి పదవులు లేకుండా ప్రతిష్ఠాత్మకమైన నీతివంతమైన రాజకీయాన్ని పాటించి 95 సంవత్సరాల వయస్సులో ఆయన అనారోగ్యంతో 1995 జూన్ 9వ తేదీన నిడుబ్రోలులోని ఆయన స్వగృహమైన గోభూమిలో తుది శ్వాస విడిచారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# ఓటమి ఎరుగని నాయకురాలు నందిని సత్పతి

### నేడు నందిని సత్పతి జయంతి



ఆమె ఒక రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్యమంత్రి. దేశంలో ముఖ్య మంత్రి పదవిని చేపట్టిన ద్వితీయ మహిళ. ఐదున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని, ప్రజా విశ్వాసాన్ని చూరగొన్న నాయకురాలు. భారత దేశాన్ని అప్రతి హతంగా కొంతకాలం ఏలిన దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీకి అత్యంత సన్నిహితురాలు, విశ్వసనీయురాలు. ఆమెనే ఐరన్ లేడీ ఆఫ్ ఒడిశాగా పేరెన్నిక గన్న నందిని సత్పతి.

నందిని సత్పతీ (1931 జూన్ 9 నుంచి 2006 ఆగస్టు 4), జూన్ 1972 నుంచి డిసెంబరు 1976 వరకు ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేశారు. 1931 జూన్ 9న ఆమె జన్మించారు. ఆమె తండ్రి పద్మభూషణ్ కలాండి చరణ్ పాణిగ్రాహి ఒడిశాకు చెందిన సుప్రసిద్ధ వ్యక్తి. ఆమె తాత స్వనేశ్వర్ పాణిగ్రాహి గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. ఆమె మామ భగవతి చరణ్ పాణిగ్రాహి ఒడిశాలో కమ్యూనిస్ట్ పార్టీ స్థాపకులు. ఆమె రెండుసార్లు ధెంకనల్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 1972 లో సార్వత్రిక ఎన్నికల్లో ఒడిశాలోని నలుగురు మాజీ ముఖ్య మంత్రులతో ఆమె ఒంటరి పోరాటం చేసి విజయం సాధించారు.

రావెన్షా కళాశాలలో ఒడియాలో ఆర్ట్స్ లో మాస్టర్స్ డిగ్రీ చదివేటప్పుడు, ఆమె కమ్యూనిస్ట్ పార్టీ విద్యార్థి శాఖ అయిన స్టూడెంట్ ఫెడరేషన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. 1951లో కళాశాల విద్యకు రుసుములు పెరిగిన నేపథ్యంలో ఒడిశాలో విద్యార్థులు నిరసన ఉద్యమం ప్రారంభించారు. ఆ తరువాత అది దేశవ్యాప్త ఉద్యమంగా రూపుదాల్చింది. ఆ ఉద్యమానికి నందిని నాయకత్వం వహించారు. ఆ సమయంలో ఆమెపై లాఠీ చార్జి కూడా జరిగింది. మిగిలిన ఆందోళన కారులతో పాటు నందినిని కూడా జైలులో పెట్టారు. అక్కడే మరో విద్యార్థి నాయకుడు దేవేంద్ర సత్పతీని కలిశారు ఆమె. తరువాత వారిద్దరూ వివాహం చేసుకున్నారు. దేవేంద్ర ధేన్కనల్ నియోజకవర్గం నుంచి లోక్ సభకు ఎంపీగా రెండు సార్లు ఎన్నికయ్యారు. నందిని సత్పతి 1962 లో రాజ్యసభలో ప్రవేశించారు. 1966లో ఇందిరా గాంధీ ప్రధాని అయిన తరువాత, నందిని సత్పతిని తన మంత్రివర్గంలో సమాచార, ప్రసార ఉప మంత్రిగా, తదుపరి మంత్రిగా నియమించుకున్నారు. నందిని సత్పతిని ప్రధానమంత్రి ఇందిరా గాంధీ రాజకీయములో కుడి భుజంగా భావించే వారు.

బిజు పట్నాయక్ మరికొంత మంది కాంగ్రెస్ పార్టీ నుంచి నిష్క్రమించిన కారణంగా 1972 లో నందిని సత్పతి ఒడిశాకు తిరిగి వచ్చి, ముఖ్యమంత్రి (జూన్ 1972 నుంచి 1976 డిసెంబర్) అయ్యారు. అలా ఒడిశా మొదటి మహిళా ముఖ్యమంత్రిగా ఉన్నారు. భారత దేశంలో ముఖ్యమంత్రి అయిన రెండవ మహిళగా ఆమె చరిత్రలో నిలిచారు. ఆమె వ్యక్తిత్వంలో ఫైర్ బ్రాండ్ నాయకత్వాన్ని గుర్తించిన ఇందిరా గాంధీ ఆశీస్సులతో నందిని ముఖ్యమంత్రిగా తొలి సారిగా జూన్ 14, 1972 లో బాధ్యతలు స్వీకరించారు. భారత దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు ఆమె పదవీకాలం ఒక సంవత్సరంలో ముగిసింది. మార్చి 6, 1973 నుండి డిసెంబర్ 16, 1976 వరకు ఆమె రెండవసారి తిరిగి ఎన్నికయ్యారు. నందిని సత్పతిని 'ఐరన్ లేడీ ఆఫ్ ఒడిశా' అని పిలిచేవారు. నందిని సత్పతి రాజకీయాలలోనే గాక ఒక రచయితగా గుర్తింపు పొందారు. ఆమె తస్లిమా నస్రీన్ నవల లజ్జాను ఒడియాలోకి అనువదించారు. అది ఆమె చేసిన ప్రధాన సాహిత్య రచన. నందిని సత్పతి సాహిత్య రచనలు ఇతర భాషలలోకి అనువదించబడి ప్రచురించ బడ్డాయి. ఓడియా సాహిత్యానికి ఆమె చేసిన కృషికి, ఆమె 1998 లో సాహిత్య భారతి సమ్మన్ అవార్డును అందుకుంది.

నందిని సత్పతి ముఖ్యమంత్రిగా ఒడిశా రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆమె ముఖ్య మంత్రిగా పనిచేసినప్పుడు, ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రకటించిన జాతీయ అత్యవసర పరిస్థితి ఆమె రాజకీయ జీవితంలో కష్టతరమైన సవాలు. కొందరు రాజకీయ నాయకులను అరెస్టు చేయడంతో ఆమె విమర్శలు ఎదుర్కొన్నారు. అల్లకల్లోల సమయంలో ఆమె చేసిన మితిమీరిన చర్యలకు ఆమె ఎప్పుడూ మద్దతు ఇవ్వలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆమె చేసిన పనితీరు దాదాపు ప్రతి రంగంలోనూ వృద్ధిని సాధించింది. ముఖ్యంగా, మహిళల సాధికారత, గ్రామీణ వృద్ధి, కళ, సంస్కృతి, విద్య వంటి రంగాల్లో, ఆమె విశేషమైన చర్యలు తీసుకున్నారు. ఆ కార్యక్రమాలు నేటి వరకు ప్రజల జ్ఞాపకాలలో మరవలేనిది రాజకీయ పరిశీకులు పేర్కొంటారు. రైతులు లేదా వ్యవసాయ దారులు కాని భూములను తమ ఆధీనంలో ఉంచిన కొద్దిమంది వ్యక్తుల చేతుల నుంచి భూములను విడిపించే ప్రత్యేకమైన భూ సంస్కరణల చట్టాన్ని తీసుకురావడం ఒక చరిత్రగా ఒడిశా రాష్ట్ర ప్రజల్లో మిగిలి పోతుంది. తన 55 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఆమె ఎన్నికల్లో ఒక్క ఓటమిని కూడా ఎదుర్కోలేదు. ఎన్నికల్లో ఆమె నలుగురు మాజీ ముఖ్యమంత్రులతో పోరాడి వారందరినీ ఓడించిన రికార్డును సొంతం చేసుకున్నారు. నందిని సత్పతి 2006 ఆగస్టు 4 న భువనేశ్వర్‌లోని తన నివాసంలో అనారోగ్యంతో మరణించారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# పాత్రికేయ దిగ్గజం రామోజీ రావు



**డబ్ల్యూజేఐ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ నివాళి**

మీడియా లెజెండ్ రామోజీరావు ఆకస్మిక మృతి బాధాకరం. వారి మరణం పట్ల వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) పక్షాన తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తున్నాను. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నాను. రామోజీ రావు గారు ఒక పాత్రికేయ దిగ్గజం. ఈనాడు, ఈటీవీలతో పాటు ఈటీవీ భారత్ మొబైల్ యాప్‌లు ప్రారంభించి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. వేలాదిమంది పాత్రికేయులను తీర్చిదిద్దిన ఘనత ఆయనది. ప్రింట్, ఎలక్ట్రానిక్, డీజిటల్ మాధ్యమాల్లో ఆయన ఉన్నత ప్రమాణాలు నెలకొల్పారు. అక్షరాన్ని ఆయుధంగా మార్చారు. పరిశోధనాత్మక జర్నలిజానికి పెద్దపీట వేసి అవినీతిని ఎండగట్టారు. తెలుగు భాషఉన్నతి కోసం పాటుపడ్డారు. ఈనాడు భాషా స్వరూపం పేరిట పుస్తకాన్ని వెలువరించి పత్రికా భాషకు కొత్త సొబగులు అద్దారు. ఈనాడు పాత్రికేయ పాఠశాల ఏర్పాటు చేసి ఏటా వందల మంది జర్నలిస్టులను తయారు చేస్తున్నారు. ఒక్క తెలుగు భాషలోనే కాకుండా అనేక ప్రాంతీయ భాషల్లో ఈటీవీ ఛానళ్లను, ఈటీవీ భారత్ మొబైల్ యాప్‌ను ప్రారంభించి దేశవ్యాప్తంగా తన నెట్‌వర్క్‌ను విస్తరింపజేశారు. అన్నదాత పేరిట వ్యవసాయ మాసపత్రికను వెలువరించి రైతులకు ఎంతో విలువైన సమాచారాన్ని అందించారు. తెలుగు వెలుగు, చతుర, విపుల పేరిట మాసపత్రికల ద్వారా తెలుగు భాషకు, సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు. దేశంలో ప్రస్తుతం ఉన్నఅన్ని మీడియా హౌసుల్లోనూ రామోజీ రావు తీర్చిదిద్దిన జర్నలిస్టులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఎడిటర్స్ గిల్డ్ చైర్మన్ గానూ సేవలు అందించారు. తెలుగు జర్నలిజంలో రామోజీ రావు సృష్టించన ఒరవడి సామాన్యమైనది కాదు. తొలిసారిగా ఆయన ప్రతి జిల్లాకు ఒక ఎడిషన్ (టాబ్లాయిడ్) ప్రారంభించి ఇతరులకు మార్గదర్శకమయ్యారు. మహిళలకోసం, బిజినెస్, సినిమా వార్తల కోసం ప్రత్యేక పేజీలకు శ్రీకారం చుట్టింది ఆయనే. అలాగే ఆరోగ్యం, ఆర్థిక అంశాలు, ఆటల కోసం, యువత కోసం ప్రత్యేక పేజీలు ప్రారంభించారు. జిల్లా ఎడిషన్లతో ఆగిపోకుండా నియోజకవర్గం స్థాయికి వెళ్లి జోన్ పేజీలను కూడా ఆయన ప్రారంభించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం పత్రిక ఉపయోగపడేలా తీర్చిదిద్దారు. వినోదరంగంలో ఈటీవీ మొదటి టీవీ ఛానల్. పాడుతాతీయగా, మార్గదర్శి, తీర్థయాత్ర, చెప్పాలని ఉంది లాంటి ఎన్నో కార్యక్రమాల ద్వారా ఆయన తన ప్రత్యేకతను చాటుకున్నారు. సంగీతం, సాహిత్యం, సాంస్కృతిక రంగాలకు ఈటీవీ ద్వారా ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి. మార్గదర్శి చిట్‌ఫండ్, ప్రియా పచ్చళ్ల ద్వారా తెలుగు వారి ఇంటింటికీ ఆయన ఆత్మబంధువయ్యారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మించి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా గిన్నీస్ రికార్డు కూడా పొందారు. తన కలల ప్రపంచాన్ని ఆయన ఆవిష్కరించుకున్న తీరు అబ్బుర పరుస్తుంది. ఉషా కిరణ్ మూవీస్ ద్వారా 60కి పైగా సినిమాలు నిర్మించారు. వాటిలోనూ సామాజిక స్పృహ ఉన్నవే అధికం. జర్నలిజాన్ని, మీడియాను జనం కోసం ప్రభావవంతంగా ప్రయోగించిన రామోజీ రావు మరణం తీరని లోటు. వారు చూపిన మార్గంలో పాత్రికేయులు, ప్రజలు నడవాలని ఆకాంక్షిస్తున్నాను. రామోజీరావు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నాను.

**-సంజయ్, ఉపాధ్యాయ**
**జాతీయ అధ్యక్షుడు**
**వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ఢిల్లీ**



## అలుపెరుగని అక్షరయోధుడికి అన్నదాతల సంతాపం

**విశ్వంభర, అమరావతి** : రామోజీరావు మరణంపై అమరావతి రాజధాని రైతులు సంతాపం తెలిపారు. వెలగపూడి, తుళ్లూరు, కృష్ణాయపాలెం, తాడికొండ గ్రామాల్లో రామోజీరావు చిత్రపటాలకు అంజలి ఘటించారు. ఈనాడు–ఈటీవీ వల్లే తమ ఉద్యమం ప్రపంచ స్థాయికి చేరిందని రైతులు గుర్తు చేసుకున్నారు. నిజాన్ని నిర్భయంగా ప్రపంచానికి చాటిన అక్షర యోధుడు రామోజీ అని అన్నదాతలు కీర్తించారు. సమాజాభివృద్ధికి రామోజీరావు చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. రామోజీరావు లాంటి మహోన్నత వ్యక్తిని ఇకపై తమ జీవితంలో ఎన్నడూ చూడలేమని ఆవేదన చెందారు. వ్యవసాయంలో ఎన్నో మెళకువలు తెలియజేశారని గుర్తు చేస్తుకున్నారు. రాజధాని రైతులు రామోజీరావు అకాల మరణానికి కన్నీటి పర్యంతమయ్యారు. ఆర్థికంగా సామాజికంగా రాజధానికి దిక్సూచి లాంటి వారు రామోజిరావు అని అన్నదాతసలు కొనియాడారు. వ్యవసాయ రంగానికి రామోజీ రావు సేవలు అనితర సాధ్యమైనవని కీర్తించారు. ఇకపై మా మార్గదర్శి లేరనే మాట మాకెతో బాధాకరంగా ఉందని రైతులు ఆవేదన చెందారు.



## మందుబాబు వీరంగం

**విశ్వంభర, మేడ్చల్ టౌన్:** గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకొయ్య జాతీయ రహదారిపై ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు. రహదారి మధ్యలో పడుకుని రాకపోకలకు ఆటంకం కలిగించాడు. స్థానికులు పక్కకు రమ్మని చెప్పినా వినకుండా తలకు గాయంతో రోడ్డుపై బైఠాయించాడు. స్థానికులు అంబులెన్స్ కు పోన్ చేసి మందుబాబు తల గాయానికి ప్రాథమిక చికిత్స అందించారు. అయితే పోలీసులు రాకుండా నాకు వైద్యం ఎందుకు చేశారంటూ అంబులెన్స్ డ్రైవర్ తో వాదనకు దిగాడు. సంఘటన స్థలానికి చేరుకున్న మేడ్చల్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.



## రామోజీరావు సేవలు చిరస్మరణీయం

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**విశ్వంభర, రాజేంద్రనగర్ :** ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు సేవలు చిరస్మరణీయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కొనియాడారు. ఆయన మృతికి సంతాపాన్ని ఆరామ్ ఘర్ చౌరస్తా వద్ద రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామోజీరావు ప్రతిక్షణం ప్రజల కోసం పరితపించారని పేర్కొన్నారు. జల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొస్తూ వాటి విష్కారానికి చొరవ తీసుకున్నారని తెలిపారు. ప్రజా పక్షపాతిగా, జనహితమే తన అభిమతంగా జీవితాంతం నిబద్ధతతో పని చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

### యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టీ.లక్ష్మారెడ్డి

**విశ్వంభర, సంగారెడ్డి :** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ ఇవ్వడం స్వాగతించదగ్గ పరిణామమని, ఎలాంటి అవాంతరాలు రాకుండా పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై. జ్ఞాన మంజరిలు అన్నారు. శనివారం సంగారెడ్డిలోని కేకే భవన్ లో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటిఎఫ్) సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు 9 సంవత్సరాలుగా పదోన్నతులు లేక 6 సంవత్సరాలుగా బదిలీలు చేయక పోవడం వల్ల పాఠశాలలకు సరియైన ఉపాధ్యాయులు లేరన్నారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన 4 డి.ఏలు వెంటనే ప్రకటించాలని, చాలా కాలంగా పెండింగ్లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.అశోక్, ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, ఉపాధ్యక్షుడు జే .కాశీనాథ్, కోశాధికారీ, పి .శ్రీనివాసరావు, అశోక్, సనాఫాతిమ,సుచరిత,నిరూపరాణి రమాదేవి, ప్రసన్న, విజయలక్ష్మి, జ్యోతి, రంగయ్య నాయుడు, వాసునాయక్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంలో మంత్రి పదవుల కంటే

# రాష్ట్రాభివృద్ధే మాకు ముఖ్యం..

- రాష్ట్రంలో ఊహించని రీతిలో విజయం సాధించాం
- ఎన్డీయే కూటమి పట్ల తమకు సంపూర్ణమైన నమ్మకం ఉంది
- రాష్ట్రానికి ఏవిధంగా న్యాయం చేయాలి అనేదే మా ఆలోచనా
- మంత్రి పదవుల కంటే కేంద్ర సహకారం ముఖ్యం
- దేశంలోనే ఒక ఉన్నత రాష్ట్రంగా తయారుచేయాలన్నదే చంద్రబాబు ఆలోచన
- చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటాం
- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు



**విశ్వంభర, శ్రీకాకుళం జూన్ 08:** టీడీపీ యువ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తాజా రాజకీయ పరిణామాలపై సోషల్ మీడియాలో స్పందించారు. ఎన్డీయే గెలవాలని కృషి చేశామని, తాము కోరుకున్నట్టుగానే కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ఏకపక్షంగా ఫలితాలు వచ్చాయని వెల్లడించారు. రాష్ట్రంలో ఊహించని రీతిలో విజయం సాధించామని, ఎన్డీయే కూటమి పట్ల తమకు సంపూర్ణమైన నమ్మకం ఉందని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఏదో ఒక మంత్రి పదవి తీసుకోవాలి, అది తీసుకోవాలి, ఇది తీసుకోవాలి అనే కంటే... రాష్ట్రానికి న్యాయం చేయాలి, ప్రాజెక్టులు పూర్తి చేయాలి, అమరావతి క్యాపిటల్ ని ర్మించాలి, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి, రెవెన్యూ లోటును భర్తీ చేయాలి, వెనుకబడిన జిల్లాలకు న్యాయం చేయాలి. అనే అంశాలకే తాము అధిక ప్రాధాన్యత ఇస్తామని రామ్మోహన్ నాయుడు వివరించారు. "ఇవన్నీ సాకారం కావాలంటే కేంద్రం నుంచి సహకారం కావాలి, దాని పైనే మేం దృష్టి పెడతామన్నారు. ఇవాళ ఆనందించాల్సిన విషయం ఎన్డీయేలో టీడీపీ మళ్లీ ప్రధాన ప్రాత పోషిస్తోంది. గతంలో వాజ్ పేయి ఉన్నప్పుడు, నాటి కూటమిలో ఇదే రకమైన పాత్ర పోషిస్తే కేంద్రం నుంచి చాలా ప్రాజెక్టులకు నిధులు తీసుకురాగలిగాం, అభివృద్ధి చేసుకోగలిగాం. ఈ రోజు కూడా అదే స్థాయిలో మన కేంద్ర ప్రభుత్వాన్ని వినియోగించుకుని... ఏపీలో గత ఐదేళ్లుగా జరిగిన నష్టాన్ని, అన్యాయాన్ని పూడ్చుకుని, దేశంలోనే ఒక ఉన్నత రాష్ట్రంగా తయారుచేయాలన్నది టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆలోచన. దానికి అన్ని రకాలుగా కేంద్రం నుంచి సహకారం తీసుకుంటాం. చంద్రబాబు తీసుకున్న ఏ నిర్ణయాన్ని అయినా సరే... మేం కష్టపడి పనిచేసి ఆ నిర్ణయాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళతాం. అందుకు మేం సిద్ధంగా ఉన్నాం. టీడీపీ నాపై ఏ బాధ్యత ఉంచినా సరే... అది కష్టమైనా, ఇష్టంగా స్వీకరించి ముందుకు నడవడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

# కడపలో చరిత్ర సృష్టించిన మహిళ



**విశ్వంభర, కడప జూన్ 08:** కడప అసెంబ్లీ నియోజకవర్గంలో మూడున్నర దశాబ్దాలుగా ఏకచత్రాధిపత్యంగా వ్యవహరిస్తున్న మైనారిటీలను కాదని మొదటిసారి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని ఇక్కడ గెలిపించారు. గత 35 ఏళ్లుగా ఇక్కడ మైనారిటీలదే హవా, ఏ పార్టీ తరపున గెలిచిన మైనారిటీలే గెలుస్తూ వచ్చారు. కానీ ఈసారి వారిని కాదని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మహిళ అభ్యర్థిని ఇక్కడ గెలిపించి చరిత్రను తిరగరాశారు. కడప ఓటర్లు. కడప అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటిగా కాంగ్రెస్ పార్టీ, ఆ తరువాత వైసీపీ తమ అధిపత్యాన్ని కొనసాగిస్తూ వచ్చాయి. అయితే మొదటిసారిగా మహిళా అభ్యర్థి ఇక్కడ గెలిచి చరిత్ర సృష్టించారు. టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన రెడ్డప్ప గారి మాధవి రెడ్డి 18 వేల ఓట్ల పైచిలుక మెజారిటీతో ప్రత్యర్థిపై విజయం సాధించారు. ఇప్పటి వరకు అన్ని పార్టీలు ఈ సీటును మైనారిటీలకే కేటాయిస్తూ వచ్చాయి. అప్పుడప్పుడు టీడీపీ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్లు ఇచ్చినప్పటికీ గెలుపు సాధ్యం కాలేదు. అయితే ఈసారి టీడీపీ రెడ్డి సామాజిక వర్గానికి టికెట్ కేటాయించి అందులోనూ మహిళకు సీట్ కేటాయించటంతో పరిణామాలు పూర్తిగా మారిపోయాయి. దాదాపు 70 వేల పైచిలుకు మైనారిటీ ఓట్లు ఉన్నప్పటికీ 35 ఏళ్ల మైనారిటీల ఆధిపత్యానికి చెక్ పడింది. ఈ సారి మెజార్టీ ఓటర్లు మాధవి రెడ్డి వైపు నిలిచి ఆమెకు విజయాన్నందించారు. ఇలా కడప నియోజకవర్గ చరిత్రలో తొలిసారి నెగ్గిన మహిళా అభ్యర్థిగా మాధవి చరిత్ర సృష్టించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ గా తీన్మార్ మల్లన్న విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు



**విశ్వంభర, కొమురవెల్లి :** ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఘన విజయం సాధించడంతో కొమురవెల్లి మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకొని స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా కొమురవెల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మాట ఇచ్చిన విధంగా ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు.రాబో రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరెన్నో సంక్షేమ పథకాలు అమలుచేసి, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ముందువుంటుదన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు సానది భాస్కర్ పాల్గొన్నారు.

## వ్యక్తి దారుణ హత్య

### నిందితుడి ఇంటికి నిప్పు పెట్టిన గ్రామస్థులు

**విశ్వంభర, నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ఒక వ్యక్తిని కొందరు శుక్రవారం రాత్రి దారుణంగా హత్య చేశారు. అతడి బంధువులు గ్రామస్థులు... హత్యలో ప్రధాన సూత్రధారి ఇంటిని ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. ఈ సంఘటన ఇందల్వాయి మండలం మెగ్యా నాయక్ తాండాలో శనివారం మధ్యాహ్నం జరిగింది. మెగ్యానాయక్ తండాకు చెందిన లకావత్ వెంగల్ ( 38) శుక్రవారం రాత్రి డిచ్ పల్లి మండలంలోని సియంసీ కళాశాల వద్ద హత్యకు గురయ్యారు. వెంగల్ హత్య లో పాల్గొన్న మెగ్యా నాయక్ తండాకు చెందిన బిక్యాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారిస్తుండగానే బిక్యాతో పాటు సంబంధం ఉన్న మరి కొందరిని అరెస్టు చేయాలని హతుని కుటుంబ సభ్యులు, తండావాసులు ఆందోళనకు దిగారు. బిక్యా ఇంటిని ముట్టడించి బీభత్సం రేపారు. అంతటితో ఊరుకోకుండా బిక్యా ఇంటికి నిప్పు పెట్టారు. ఈ నేపథ్యంలో తండాలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కుటుంబ కలహాలతో ఈ హత్య జరిగింది.



## అరోమా హోటల్ భోజనం తిన్నారంటే రోగాలు ఖాయం

### ఫుడ్ కంట్రోల్ అధికారుల్లో బయటపడ్డ నమ్మలేని నిజాలు



**విశ్వంభర, నిజామాబాద్ సిటీ :** పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది జిల్లాలో ప్రముఖ రెస్టారెంట్లు, హోటళ్ల తీరు. ప్రజల ఆరోగ్యం పట్ల ఏ మాత్రం శ్రద్ధ చూపని పలు హోటళ్ల యాజమాన్యాలు నిలువ ఉంచిన కుళ్లిన మాంసాన్ని వండి ఆకర్షణీయమైన రంగులతో ప్రజలను మోసం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రెస్టారెంట్ల పరిస్థితి ఇలానే ఉంది. శనివారం నిజామాబాద్ నగరంలోని కల్తీ ఫుడ్ పై అధికారులు కొరడా ఝులిపించారు. ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు, కంట్రోలర్ నగరంలోని పలు హోటళ్లపై దాడులు నిర్వహించారు. నగరంలోని హైదరాబాద్ రోడ్డు వద్ద గల అరోమా రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. అరోమా రెస్టారెంట్ వంటశాలను పూర్తిగా పరిశీలించారు. ఈ దాడిలో నిలువ ఉంచిన చికెన్, ఫిష్ మాంసం, కలరు వాడిన బిర్యానీ, అధికారులు స్వాధీనం చేసుకుని చెత్తబుట్టలో వేశారు. అదేవిధంగా నగరంలోని పలు రెస్టారెంట్లను కూడా అధికారులు తనిఖీలు చేపట్టారు.

## భార్యాభర్తలు ఆత్మహత్య

- డిప్రెషన్ తో భార్య సూసైడ్
- దీంతో ఉరేసుకున్న భర్త
- జగద్గిరిగుట్ట మల్లారెడ్డి నగర్ లో భార్య, చింతల్ హెచ్ఎంటి జంగిల్ లో భర్త బలవన్మరణం



**విశ్వంభర, పేట్ బషీరాబాద్:** భార్య ఆత్మహత్య చేసుకోవడంతో భర్త కూడా బలవన్మరణానికి పాల్పడిన సంఘటన జగద్గిరిగుట్ట, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ ల పరిధిలో చోటుచేసుకుంది. జగద్గిరి గుట్ట మల్లారెడ్డి నగర్ లో యశ్వంత్ (27), శ్రీయ (23) భార్యాభర్తల ఆత్మహత్యలు కలవరం రేపింది. బిగ్ బాస్కెట్ లో డెలివరీ బాయ్ గా పనిచేస్తుంటాడు యశ్వంత్. ఇతని భార్య గత కొన్ని రోజులుగా మెంటల్ డిప్రెషన్ తో బాధపడుతుంది. దీంతో ఆమె ఇంటి లో ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అదేవిధంగా భర్త యశ్వంత్ సైతం జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధి హెచ్ఎంటి జంగిల్ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని చనిపోయాడు. అయితే భార్య సూసైడ్ చేసుకోవడంతో యశ్వంత్ కూడా ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇరువురి మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.



## పారదర్శకంగా జిల్లాలో హోంగార్డుల బదిలీ

### జిల్లా ఎస్పీ గౌష్ ఆలం

**విశ్వంభర, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో హోంగార్డుల బదిలీ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసినట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రతి సంవత్సరం హోంగార్డుల బదిలీ ప్రక్రియ ను నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా నిర్మల్ జిల్లా నుండి 62 మంది హోంగార్డులు, అదేవిధంగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా నుండి 35 మంది హోంగార్డులు ఆదిలాబాద్ జిల్లాకు రానుండగా, వారి స్థానంలో ఆదిలాబాద్ జిల్లా నుండి మొత్తం 97 మంది హోంగార్డులను లక్కీ లాటరీ విధానం ద్వారా బదిలీ ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో సాధారణ విధులు నిర్వర్తించే హోంగార్డులు, వాహన డ్రైవర్స్, దోబీలు, వంట పని చేసే వారు, వివిధ రంగాలలో విధులు నిర్వహిస్తున్న మొత్తం 97 మందిని నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలకు ఇద్దరిని ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించినట్లు తెలియజేశారు. బదిలీ ప్రక్రియను అందరూ హోంగార్డుల నడుమ పారదర్శకంగా ఎటువంటి అపోహలు లేకుండా నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు,స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నవీన్ ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.





## జాతీయ లోక్ అదాలత్ లో 68 కేసులు పరిష్కారం

**విశ్వంభర, జహీరాబాద్ :** మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్ట్ కాంప్లెక్స్ లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో సీనియర్ కోర్టు విభాగంలో 29 బ్యాంకు పిఎల్సీ , 10 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కారం కాగా బ్యాంకు పీఎల్సి , సైబర్ క్రైమ్ కేసుల నుంచి రూ.37,84,134 వసూలు అయ్యాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా జూనియర్ కోర్టు విభాగంలో సివిల్ 1 కేసు, క్రిమినల్ కాంపౌండ్ 8 కేసులు, 1 సెకండ్ క్లాస్ కేసు, 5 అడ్మిషన్ కేసులు,14 ఎక్సైజ్ కేసులు పరిష్కారం కాగా రూ.1.14 లక్షలు వసూలు అయ్యాయేని సీనియర్ సివిల్ జడ్జి , మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.సూరికృష్ణ లు ఒక ప్రకటనలో తెలిపారు.



## వచ్చే సోమవారం నుండి యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం

**విశ్వంభర, రంగారెడ్డి :** ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుండి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ శశాంక ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.



## కన్నుల పండుగగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**విశ్వంభర, కోరుట్ల రూరల్:** పట్టణ శివారులోని శ్రీ గుండు వెంకటేశ్వర స్వామి కళ్యాణం శనివారం కన్నుల పండుగగా జరిగింది. ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు స్వామివారిని దర్శించుకుని స్వామివారికి అమ్మవారలకు ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణ రావుతో పాటు కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెరుమాండ్ల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ వాసం అజయ్, చింతకింది శేఖర్, సత్యం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ గా సోనియా గాంధీ

**విశ్వంభర, ఢిల్లీ:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ గా కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ మరోసారి ఎన్నికయ్యారు. పార్లమెంటు సెంట్రల్ హాల్లో ఈరోజు జరిగిన సమావేశంలో ఎంపీలు సోనియా గాంధీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీపీ ఛైర్పర్సన్గా ఆమె పేరుతో పాటు గౌరవ్ గొగోయ్, తారిఖ్ అన్వర్, సుదర్శన్ పేర్లను నేతలు ప్రతిపాదించారు. ఈ క్రమంలో నేతలంతా సోనియావైపు మొగ్గుచూపారు. దిలా ఉంటే... ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకొని భంగపడ్డ మోదీ నాయకత్వ హక్కును కోల్పోయారని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైఫల్యానికి బాధ్యత వహించాల్సింది పోయి, రేపు ప్రమాణస్వీకారానికి సిద్ధమవుతున్నారని సోనియా గాంధీ విమర్శించారు. కాంగ్రెస్ ప్రదర్శన పేలవంగా ఉన్న రాష్ట్రాల్లో మెరుగవ్వడంపై తాము దృష్టి పెడుతామని తెలిపారు.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడానికి ఇది కొత్త అవకాశమని అన్నారు.



## చేనేత కార్మికులకు 365 రోజులు పని కల్పించేలా చర్యలు

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**విశ్వంభర, హైదరాబాద్ :** చేనేత కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూర్చే పథకాల కోసం చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 365 రోజులు పొడవునా చేతినిండా పని కల్పించే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పని చేస్తున్న ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. 10 శాతం యార్న్ రాయితీ పథకాన్ని కేబినెట్ ఆమోదం లేకుండా ప్రవేశ పెట్టడం వల్ల నిధులు విడుదల కాలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# నెట్ ఫ్లిక్స్ పై రూ.1,419 కోట్లకు దావా

- నెట్ ఫ్లిక్స్ లో హిట్టయిన బేబీ రెయిన్ డీర్ వెబ్ సిరీస్
- కమెడియన్ రిచర్డ్ గాడ్ అనుభవాల ఆధారంగా తెరకెక్కిన సిరీస్
- అందులో తన గురించి తప్పుగా చూపించారన్న మహిళ




**విశ్వంభర, ఢిల్లీ:** ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ పై ఓ మహిళ భారీ మొత్తంలో దావా వేయడం ఆసక్తి కలిగిస్తోంది. స్కాట్లాండ్ కు చెందిన ఆ మహిళ పేరు ఫియోనా హార్వే. నెట్ ఫ్లిక్స్ లో ప్రసారమవుతున్న 'బేబీ రెయిన్ డీర్' అనే వెబ్ సిరీస్ తన జీవిత కథ ఆధారంగానే తెరకెక్కించారని, హాస్యనటుడు రిచర్డ్ గాడ్ చెప్పిన ఆ కథను నిర్ధారించుకోకుండానే నెట్ ఫ్లిక్స్ వెబ్ సిరీస్ గా మలిచిందని ఫియోనా హార్వే ఆరోపించారు. నిజ జీవిత గాథ అంటూ ప్రచారం చేసుకున్నారని, కానీ అందులో నిజానిజాలను నిర్ధారించుకునే ప్రయత్నం చేయలేదని తెలిపారు. తన పరువు ప్రతిష్ఠలు దెబ్బతీసేలా అందులో కొన్ని సీన్లు ఉన్నాయని అన్నారు. ఈ క్రమంలో ఆమె నెట్ ఫ్లిక్స్ పై రూ.1,419 కోట్లకు కాలిఫోర్నియా ఫెడరల్ కోర్టులో పరువునష్టం దావా వేశారు. మార్తా స్కాట్ అనే మహిళ ద్వారా తాను ఎలా వేధింపులకు గురయ్యాడో కమెడియన్ రిచర్డ్ గాడ్ చెప్పిన అనుభవాల మేరకు ఈ వెబ్ సిరీస్ తెరకెక్కించారు. నెట్ ఫ్లిక్స్ లో వచ్చిన ఈ 'బేబీ రెయిన్ డీర్' సిరీస్ హిట్ టాక్ తెచ్చుకుంది. అయితే, ఇందులో తనను ఓ నేరస్తురాలిగా ముద్ర వేశారని, వేధింపుల కారణంగా జైలుకు వెళ్లినట్టు, కమెడియన్ రిచర్డ్ గాడ్ పై తాను లైంగిక దాడికి పాల్పడినట్టు చూపించారని ఫియోనా హార్వే ఆరోపించింది. ఈ వెబ్ సిరీస్ నిండా దారుణమైన అబద్ధాలు ఉన్నాయని తెలిపారు. నెట్ ఫ్లిక్స్ మాత్రం హార్వే ఆరోపణలకు తలొగ్గేది లేదని స్పష్టం చేస్తోంది. తన జీవితంలో ఏం జరిగిందో చెప్పే హక్కు కమెడియన్ రిచర్డ్ గాడ్ కు ఉందని, అతడి జీవిత అనుభవాలనే తాము చూపించామని తేల్చి చెప్పింది.

# ఆదివారం సినిమా షూటింగ్‌లు బంద్

- రామోజీ మృతికి నివాళిగా నిలిపివేత
- నిర్మాతల మండలి ప్రకటన
- ఫిల్మ్ సిటీలో రామోజీ పార్థివదేహానికి ప్రముఖుల నివాళి




**విశ్వంభర, హైదరాబాద్:** రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మరణంపై సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిత్ర పరిశ్రమకు ఆయన మరణం తీరని లోటు అని వ్యాఖ్యానించారు. మీడియా సహా పలు రంగాల్లో ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించి, ప్రజలకు సేవ చేసిన ఆ మహనీయుడికి నివాళులు అర్పించారు. ఫిల్మ్ సిటీలో రామోజీరావు పార్థివదేహాన్ని కడసారి చూసి, నివాళులు అర్పించారు. ప్రముఖ నటులు మోహన్ బాబు, నరేశ్, కల్యాణ్ రామ్, సాయికుమార్, దర్శకులు రాఘవేంద్ర రావు, రాజమౌళి, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, కీరవాణి తదితరులు ఫిల్మ్ సిటీకి చేరుకున్నారు. కాగా, రామోజీరావు మరణంపై తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి విచారం వ్యక్తం చేసింది. సినిమా రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ సంతాపం ప్రకటించింది. రామోజీరావు మృతికి సంతాపంగా ఈ రోజు సినిమా షూటింగ్ లు అన్నీ నిలిపేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు నిర్మాతల మండలి శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

# ప్రేమించి పెళ్లి చేసుకుని వేధింపులు




**విశ్వంభర, మధురానగర్:** ప్రేమించి పెళ్లి చేసుకుని ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని డబ్బులు తీసుకుని వేరే మహిళలతో ఫోన్ చేయించి వేధిస్తున్నాడని ఓ మహిళ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కదులూరి కనకమహాలక్ష్మి, బిల్లాకుర్తి అప్పారెడ్డి ప్రేమించుకున్నారు. గతేడాది ఆగస్టులో వివాహం చేసుకుని మధురానగర్‌లో నివాసం ఉంటున్నారు. వివాహం అయిన నెల తర్వాత తనకు ఆర్థిక ఇబ్బందులు వచ్చాయని రూ.30లక్షలు కావాలని అప్పారెడ్డి కనకమహాలక్ష్మిని అడిగాడు. ఆమె స్నేహితులు, బంధువుల వద్ద అప్పు తీసుకుని, బంగారం తాకట్టు పెట్టి క్రెడిట్ కార్డు ఉపయోగించి మొత్తం రూ.15 లక్షలు ఇచ్చింది. డబ్బులు తీసుకున్నాక ఆర్థిక ఇబ్బందులు పోవాలంటే చైనాకు వెళ్తానని చెప్పి 29–3–2024న వెళ్లాడు. అతడు వెళ్లిన రెండు రోజులకు మృదుల బండారు అనే మహిళ ఫోన్ చేసి అప్పారెడ్డి తన భర్త అని, ఐదు సంవత్సరాల బాబు ఉన్నాడని చెప్పింది. వెంటనే అప్పారెడ్డికి ఫోన్ చేసి అడగగా అది అబద్ధం అని, ఆమె నంబర్ బ్లాక్ చేయమని చెప్పాడు. నెల రోజులకు శ్రీకర్ సీత అనే మహిళ ఫోన్ చేసి అప్పారెడ్డి మోసగాడని, అతడిని వదిలేయాలని బెదిరించింది. దీంతో ఈ మహిళలు అప్పారెడ్డితో ఉండి తనను మోసం చేస్తున్నారని, న్యాయం చేయాలని కనకమహాలక్ష్మి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## రామోజీకి కేసీఆర్ సంతాపం

**విశ్వంభర, హైదరాబాద్ :** ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీ రావు మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత. మాజీ ముఖ్యమంత్రి కుల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సంతాపం ప్రకటించారు.పలు రంగాల్లో వ్యాపారవేత్తగా, మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా వారందించిన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. శోక తప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### మాజీ మంత్రి హరీష్ రావు...



ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు గారి మృతి తీరని లోటు. సాధారణ వ్యక్తిగా ప్రారంభమైన ఆయన జీవితం నేడు అందరికీ ఆదర్శం. నిరంతర శ్రమ, నిత్యం కొత్తదనం కోసం తపన, చెదరని ఆత్మస్థైర్యం, నిబద్ధత, క్రమశిక్షణ కలగలిసిన గొప్ప వ్యక్తి ఆయన. తెలుగు వాడి సత్తాను యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన రామోజీరావు గారు చిరస్మరణీయులు. పత్రిక, టీవీ, సినిమా తదితర రంగాల్లో రామోజీరావు గారు సాధించిన విజయాలు ఆయనకు మాత్రమే కాకుండా యావత్ తెలుగు జాతికి గర్వకారణం. రామోజీరావు గారి కుటుంబానికి, రామోజీ సంస్థల ఉద్యోగులకు నా ప్రగాఢ సంతాపం.

### కాంగ్రెస్ నేత కుందూరు జానారెడ్డి



ఈనాడు గ్రూప్స్ రామోజీరావు గారి మృతిపట్ల మాజీ మంత్రి,సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి గారు సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఆయన మరణం తెలుగు రాష్ట్రాల్లో తీరని లోటు అని పేర్కొన్నారు.అతి సామాన్య కుటుంబంలో పుట్టి పత్రిక, మీడియా, టెలివిజన్ రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి తెలుగు జాతికి రామోజీ రావు గర్వకారణంగా నిలిచారని గుర్తు చేశారు

### శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



ఈనాడు సంస్థల అధినేత , మీడియా లెజెండ్ రామోజీ రావు గారి మరణం పట్ల తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సామాన్య వ్యక్తి స్థాయి నుండి విలువలతో కూడిన జర్నలిస్ట్ గా అంచెలు అంచెలుగా ఎదిగి ,లక్షలాది మందికి ఉపాధిని కల్పించే స్థాయికి ఎదిగిన ఆయన జీవితం చాలా ఆదర్శనియమని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. రామోజీరావు గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని , వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు సుఖేందర్ రెడ్డి తెలిపారు.

### రామోజీరావు సంస్థతోనే నా సినీ ప్రస్థానం మొదలైంది



విశ్వంభర, హైదరాబాద్ : సినీరంగంలో అద్భుతాలు సృష్టించిన రామోజీరావు, తుదిశ్వాస విడవడం తీరని లోటని సినీ ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిల్మ్ సిటీలో రామోజీరావు పార్థీవదేహానికి నివాళులర్పించిన ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు.రామోజీరావు సంస్థ ద్వారా 'తొలి చూపులోనే' సినిమాతో నా సినీ ప్రస్థానం మొదలైంది. నాలాగే ఎంతో మంది సినీతారలకు అవకాశం ఇచ్చారు. టీవీలోనూ రచయితలు, నటులను పరిచయం చేశారు. ఈనాడు, ఈటీవీల ద్వారా నమ్మకమైన వార్తలను అందించిన వ్యక్తి రామోజీరావు. సినిమా ఇండస్ట్రీకి రామోజీ ఫిల్మ్ సిటీ గొప్ప ఆస్తి. ఆయన మరణం కలచి వేస్తోంది. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాదించాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను. అని నందమూరి కల్యాణ్ రామ్ అన్నారు. రామోజీరావు లేరనే వార్త చాలా బాధాకరంగా ఉంది. ఆయనతో మాకుటుంబానికి మంచి సంబంధాలుండేవి. ఆయన ఎప్పుడు కలిసిన జీవితం గురించి చెప్పేవారు. కోట్ల మందికి ఆయన మార్గదర్శకుడు. ఈటీవీలో ప్రసారమైన వావ్ షోతో నాకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చారు. అని సాయి కుమార్ గుర్తు చేసుకున్నారు.

# ప్రిలిమ్స్ కు ఆర్టీసీ స్పెషల్ బస్సులు




**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రూప్–1 ప్రిలిమనరీ పరీక్ష రాసే అభ్యర్థుల సౌకర్యార్థం TGSRTC ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అభ్యర్థులకు ఆదివారం రవాణాపరంగా అసౌకర్యం కలగకుండా ప్రత్యేక బస్సులను నడుపుతోంది. రాష్ట్రంలోని 897 పరీక్షా కేంద్రాలకు బస్సులను నడపాలని క్షేత్రస్థాయి ఆర్టీసీ అధికారులకు ఇప్పటికే సంస్థ యాజమాన్యం ఆదేశాల్విడం జరిగింది. రాజధాని హైదరాబాద్ నుంచి జిల్లాలకు ఈ రోజు సాయంత్రం నుంచే అభ్యర్థుల రద్దీ ఎక్కువగా ఉన్నందున.. ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్ పాయింట్లలో తగు ఏర్పాట్లును సంస్థ చేసింది. ఆయా ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్లలో ప్రత్యేక అధికారులను నియమించడం జరిగింది. రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను వారు అందుబాటులో ఉంచుతారు. రాష్ట్రంలోని ప్రధాన బస్ స్టేషన్లలో 'May I Help You' కౌంటర్లను సంస్థ ఏర్పాటు చేసింది. అక్కడ పరీక్షా కేంద్రాల సమాచారాన్ని అభ్యర్థులకు ఇవ్వడంతో పాటు ఏ బస్సులో వెళ్లాలో అధికారులు చెప్తారు. రాష్ట్రవ్యాప్తంగా 4.03 లక్షల మంది విద్యార్థులు గ్రూప్–1 ప్రిలిమినరీకి హాజరవుతుండగా.. అందులో గ్రేటర్ హైదరాబాద్‌లోనే దాదాపు 1.70 లక్షల మంది రాస్తున్నారు. వారికీ రవాణాపరంగా అసౌకర్యం కలగకుండా రద్దీకి అనుగుణంగా సిటీ బస్సులను అందుబాటులో ఉంచడం జరిగింది. ఆర్టీసీ బస్సుల్లో క్షేమంగా పరీక్షా కేంద్రాలకు వెళ్లి.. ప్రశాంత వాతావరణంలో గ్రూప్–1 ప్రిలిమనరీ పరీక్ష రాయాలని కోరుతూ.. సజ్జనార్ అభ్యర్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

## బస్ పాస్ ధర భారీగా తగ్గింపు




**విశ్వంభర, హైదరాబాద్ :** మీరు హైదరాబాద్ సిటీ బస్సుల్లో నిత్యం ప్రయాణాలు చేస్తుంటారా..? అయితే మీకే ఈ గుడ్ న్యూస్. ఎకో ఫ్రెండ్లీ ఎలక్ట్రిక్ గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సుల్లో ప్రయాణించే ప్యాసింజర్స్ కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆ బస్సుల నెలవారీ బస్ పాస్ రేటును భారీగా తగ్గించింది. కేవలం 1900 రూపాయలకే ఈ బస్ పాస్‌ను అందజేస్తోంది. గతంలో ఈ బస్ పాస్ ధర రూ.2530 ఉండగా.. ప్రయాణికులపై భారం తగ్గించేందుకు తాజాగా రూ.630 తగ్గించింది. ఈ బస్సు పాస్ కలిగి ఉంటే.. 219 రూట్ సికింద్రాబాద్–పటాన్ చెరువు, 195 రూట్ బాచుపల్లి – వేవ్ రాక్ సర్వీసుల్లో నడిచే గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సుల్లో ట్రావెల్ చెయ్యొచ్చు. అంతే కాదండోయ్, ఈ బస్‌పాస్‌తో గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సులతో పాటు ఈ–మెట్రో ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో సైతం ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. ఐతే విమానాశ్రయం రూట్ లో నడిచే పుష్పక్ ఏసీ బస్సుల్లో ఈ పాస్ చెల్లుబాటు కాదు. అలాగే, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు పాస్ ఉన్నవారు రూ.20 కాంబినేషన్ టికెట్ తీసుకుని.. గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సుల్లో ఒక ట్రిప్పులో ట్రావెల్ చేయొచ్చని అధికారులు తెలిపారు. నగరంలోని టీజీఎస్ ఆర్టీసీ బస్సు పాస్ కేంద్రాలలో ఈ పాస్‌లు అందుబాటులో ఉంటాయి.




## ఐప్యాక్ ఓ పనికిమాలిన సంస్థ

### మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

**విశ్వంభర, విజయవాడ:** వాలంటీర్ వ్యవస్థ, ఐప్యాక్ వైసీపీ ఓటమికి కారణాలయ్యాయని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'వాళ్లను నమ్మి వైఎస్ జగన్ కార్య కర్తలు, ఎమ్మెల్యేలకు సైతం సముచిత స్థానం కల్పించలేదు అని అన్నారు. ఐప్యాక్ పనికిమాలిన సంస్థ. అందులో రాజకీయాలకు పనికిరాని డిగ్రీలు చదివిన వారు తమ పబ్బం గడుపుకున్నారు. ఎమ్మెల్యేలపై అసంతృప్తిగా ఉన్న వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని నివేదికలు పంపారు' అని కొట్టు సత్యనారాయణ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాగా, వైఎస్ జగన్ నియంతృత్వ పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడుతూ.. తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమికి పట్టం కట్టారు.కూటమి దెబ్బకు వైసిపి పార్టీ అడ్రస్ లేకుండా పోయింది. ఎన్డీఏ కూటమిలోని టీడీపీ 135, జనసేన 21, బీజేపీ 8 చోట్ల విజయం సాధించాయి. వైసీపీ 11 సీట్లకే పరిమితమైంది. 175 సీట్లకు గాను ఎన్డీయే కూటమి 164 సీట్ల అఖండ మెజారిటీతో అధికారాన్ని కైవసం చేసుకుంది





## నూతన కోర్టు భవనం మంజూరు చేయాలి

**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 08:** ఆమనగల్లులో నూతన కోర్టు భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందరభంగా సభ్యులు మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న భవనంలో కొనసాగుతున్న కోర్టు భారీ వర్షాలకు భవనం తట్టుకోలేదని వెంటనే స్పందించి కొత్త భవనానికి స్థలం కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు యాదవ్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, యాదిలాల్, సుధాకర్ రెడ్డి, న్యాయవాదులు రామకృష్ణ, శేఖర్, కొప్పు కృష్ణ, మధు సంతోష్, గణేష్, మల్లేష్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నెలలు గడుస్తున్నా.. అందని వేతనాలు.

### ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న 3వ ఏఎన్ఎంలు

**విశ్వంభర, దేవరకొండ జూన్ 08:** దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న 3వ ఏఎన్ఎంలకు సకాలంలో జీతాలు అందకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. వీరికి జీతాలను ప్రభుత్వం ఏజెన్సీల ద్వారా అందించడం జరుగుతుంది. కానీ ఇంత వరకూ ఎప్పుడూ కూడా వీరికి సకాలంలో జీతాలు అందిన దాఖలాలు లేవని వారు అంటున్నారు. వీరు సుమారు 10 నుంచి 15 గ్రామాలు లేదా తండాల్లో వీరి సేవలను అందించాల్సి ఉంటుంది. సమయానికి జీతాలు అందక పోవడంతో ట్రావెలింగ్ ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తుంది వాపోతున్నారు. వీరి శ్రమకు, పనికి తగ్గ వేతనం ఇవ్వకపోయినా కనీసం ఇచ్చేదేదో సమయానికి ఇస్తే బాగుంటుందని, అదే విషయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం మరియు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఏఎన్ఎంలు కోరుతున్నారు.



## సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం

**విశ్వంభర, ఆమనగల్లు జూన్8:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గృహజ్యోతి పథకం అమలుచేసిన నేపథ్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, ఎంపీటీసీల గౌరవ అధ్యక్షుడు గుడూరు శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షులు బిచ్చ నాయక్, తెలగమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మండల మాజీ అధ్యక్షులు మంగ్లీ రాములు, తల్లోజు రామకృష్ణ, గాజుల శీను, కృష్ణ నాయక్, ఖాదర్, శివలింగం, వస్పుల శ్రీశైలం, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## అట్టహాసంగా ప్రారంభమైన ఆటా - 2024

### సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి

**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 08:** అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో అమెరికా జార్జియా, అట్లాంటా వేదికగా జరుగుతున్న 18వ ఆటా – 2024 వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయని రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి తెలిపారు.ఈ నెల 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు జరగనున్నట్లు తెలియజేశారు. ప్రవాస భారతీయులు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిపే ఆటా వేడుకల్లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారు పెద్ద ఎత్తున పాల్గొన్నారని తెలిపారు. ఆటా–2024 అధ్యక్షురాలు మధు బొమ్మినేని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అనంతరం అనేక సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ప్రముఖుల సాహిత్య కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయని లక్ష్మీ నర్సింహా రెడ్డి తెలిపారు. ఆటా వేడుకలలో తెలుగు రాష్ట్రాలలో మన సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఆటా ప్రతినిధులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అమెరికాలో నివసించే తెలుగు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మరియు వ్యాపార రంగానికి సంబంధించిన పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.తెలంగాణ వ్యాప్తంగా వివిధ గ్రామాల నుండి స్థిరపడిన ప్రవాస భారతీయులు సొంత ప్రాంతాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, నిరుపేదలకు చేయూత అందించాలని ఆటా ప్రతినిధులను ఈ వేడుకల ద్వారా కోరినట్లు లక్ష్మీ నర్సింహా రెడ్డి తెలిపారు. ఆటా వేడుకల్లో పాల్గొనడానికి అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆటా ప్రతినిధులు కిషోర్ గూడూరు, జయంత్ చల్ల, సుభాష్ కట్టెగుమ్మల, లక్ష్మణ్ గూడూరు, ఆలే రామకృష్ణ, కిరణ్ గూడూరు, అనిల్ భోదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మలబార్ గోల్డ్ షోరూంను ప్రారంభించిన నటి పూనంకౌర్

**విశ్వంభర, బషీర్‌బాగ్ జూన్ 08 :** ప్రముఖ అంతర్జాతీయ ఆభరణాల వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్, డైమండ్స్ కొండాపూర్‌లో నూతన అంగులతో ఏర్పాటు చేసిన తమ షోరూంను సినీ నటి పూనంకౌర్, మేనేజింగ్ డైరెక్టర్, ఇండియన్ యాక్రెస్, యోగేష్ ముద్రాస్‌ల చేతుల మీదుగా ప్రారంభించారు. 'ఫార్చ్యూన్ సైబర్, కొండాపూర్, హైదరాబాద్ షోరూంను మార్చబడిందని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఛైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. మరింత విశాలమైన ప్రదేశంలో అత్యాధునిక అంగులతో తీర్చిదిద్దిన షోరూంలో విలాసవంతమైన వాతావరణంతో, అద్భుతమైన ఆభరణాల సేకరణలు అందుబాటు ధరల్లో లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అతిథులు, వినియోగదారులు, మలబార్ గోల్డ్ డైమండ్స్ మేనేజ్ మెంట్ బృంద సభ్యులు పాల్గొన్నారు.





# చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం

**విశ్వంభర, నాంపల్లి జూన్ 08:** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మినిస్టర్ పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. బత్తిని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చేప మందు పంపిణీ ఆనవాయితిగా జరుగుతుందన్నారు. చాలా కాలంగా చేప మందు పంపిణీ విశ్వాసంతో ప్రజలు వేసుకుంటున్నారని తెలిపారు. 150 సంవత్సరాలుగా బత్తిని కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అస్తమా, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులు ఈ ఫిష్ మెడిసిన్‌గా చేప మందు పని చేస్తుందన్నారు. ఈ చేప మందుకోసం వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు భారీగా తరలి వస్తున్నారని పేర్కొన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం చేప ప్రసాదం కోసం చేపలు ఏర్పాటు చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. చేప మందు వేసుకునేందు రెండు తెలుగు రాష్ట్రల నుంచి ప్రజలు పోటెత్తారు. కార్యక్రమంలో, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఫిషరీస్ కాంగ్రెస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ పాల్గొన్నారు.





# మహాధర్నాను విజయవంతం చేయాలి

### బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్



**విశ్వంభర, భువనగిరి :** జూన్ 15న ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం భువనగిరిలోని ఎస్వీ హోటల్ లో వివిధ బీసీ కుల సంఘాలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించి ఆయన విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో సమగ్ర కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకోవాలని కాంగ్రెస్ పెద్దలు చూడటం అత్యంత దుర్మార్గం అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కులగణన చేసి, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళ్తే బీసీలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా కులగణన చేస్తామని రాహుల్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చెప్పినందుకే. కాంగ్రెస్ పార్టీకి 99 ఎంపీ సీట్లు దక్కిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గతంలో బీసీలను మోసం చేసినందుకే దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమైందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా మరోసారి బీసీలను మోసం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తున్నారని, అదే జరిగితే.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పుట్టగతులు లేకుండా పోతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా అసెంబ్లీలో కులగణన బిల్లు ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న ఇందిరా పార్కు దగ్గర బీసీ జనసభ తలపెట్టిన మహాధర్నాకు వివిధ బీసీ కుల సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి.
ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేష్ యాదవ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు అతికం లక్ష్మి నారాయణ గౌడ్, అడ్వొకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లొడంగి గోవర్దన్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల క్రిష్ణ, ఎంపీటీసీ రాసాల మల్లేష్ యాదవ్, గుండెబోయిన సురేష్ యాదవ్, పల్లెగొర్ల రాందేవ్, మాజీ సర్పంచ్ జక్కుల వెంకటేష్, పల్లెపటి రాజు ముదిరాజ్, ఆవిషెట్టి రమేశ్, మద్రి పాండు, నరాల రాజు యాదవ్, మట్ట బాలకృష్ణ గౌడ్, బత్క అశోక్, శ్రీరాం శరత్, కొల్ల యాదగిరి గౌడ్, కదారి ప్రవీణ్, కుచ్చుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## వైదిక బ్రాహ్మణులు పరిరక్షణకు కృషి చేయాలి

**విశ్వంభర, హైద్రాబాద్ :** తెలంగాణలో వైదిక బ్రాహ్మణులు అనేక సమస్యలతో వివక్షతకు గురవుతున్నారని తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు మురుకుంట్ల రాజేశ్వర శర్మ, పుప్పల రుద్రవీణ బాల సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాశ్చత్య విష సంస్కృతి వల్ల దేశంలో ఎక్కడ ఏది జరిగిన కూడా బ్రాహ్మణులపై దాడులు చేయడం, బాధ్యులను చేయడం వంటివి జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు డిమాండ్లతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. నిరుపేద బ్రాహ్మణులుకు నెలకు 15000 రూపాయల గౌరవ వేతనంతో పాటు ఆరోగ్య భద్రతా కల్పించడంతోపాటు రాబోవు కాలంలో బ్రాహ్మణుల భద్రత కోసం బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం అన్నారు. బ్రాహ్మణులు ఎంత మంది ఉన్నారు ఏంటి అనేది శాఖా పరంగా జనన గణన చేయాలని, అలాగే ముఖ్యంగా అర్చకులకు, పురోహితులను సంరక్షించడానికి ప్రత్యేకంగా ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నవిస్తామని వారు తెలియజేసారు. బ్రాహ్మణులకు పలు సామజిక వర్గాలు మద్దతు తెలపడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాడ పాపయ్య శర్మ, నారాయణం చక్రవర్తి, చాడ చిన్మయ శర్మ, ప్రకాష్ శర్మ, వేమవరపు వెంకటరమణ శర్మ, అర్పిత తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలు ముద్దు..

**విశ్వంభర, చింతపల్లి :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తగినంత మంది ఉన్నా ప్రైవేట్ పాఠశాలల మాయదారి ప్రచారానికి తట్టుకోలేక విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు వైపు మొగ్గు చూపడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. ఎలాగైనా ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తేవడానికి ఉపాధ్యాయులు వీధి వీధి తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న విధానముపై అవగాహన కల్పిస్తున్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం గౌసుద్దీన్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు జయశంకర్ బడిబాట కార్యక్రమం చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో గ్రామంలోని ఇల్లులు తిరుగుతూ.. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేరేలా తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని, ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో పాటు ఉపాధ్యాయులు చదువుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.ఈ కార్యక్రమంలో రామతులసి, సత్తయ్య, పద్మరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వరీ, అలివేలు, లక్ష్మీబాయి , పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ వైద్యులపై తనిఖీలను వెంటనే ఆపాలి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం)జూన్ 08 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కూరేళ్ల గ్రామంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు సూదగాని లక్ష్మయ్య గౌడ్ మాట్లాడుతూ.. మా ముత్తాతలు , తాతల నుంచి ఇదే వైద్యాన్ని నమ్ముకొని ప్రజలకు సేవలను అందిస్తున్నామన్నారు. తామే నిజమైన ధన్వంతరి వారసులం అని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఈ ప్రాంత ప్రజలను కుటుంబ సభ్యుల వలె భావించి వైద్య సేవలు అందిస్తున్న తమపై నకిలీ వైద్యులని ముద్ర వేసి అక్రమ కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. మా పొట్ట మీద కొట్టొద్దు అని నేషనల్ మెడికల్ కౌన్సిల్, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరుపుతున్న తనిఖీలను వెంటనే ఆపేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే తనిఖీలను, దాడులను ఆపాలని ఆర్డర్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు గ్రామీణ వైద్యులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులను గ్రామీణ వైద్యులు కోరుతున్నట్లు తెలిపారు.




## ఆమనగల్లు కోర్టులో 1392 కేసుల పరిష్కారం

**విశ్వంభర, ఆమనగల్లు జూన్8:** ఆమనగల్లు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కాటం స్వరూప ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమనగల్, మాడుగుల, కడ్తాల్ మరియు తలకొండపల్లి పోలీస్ స్టేషన్లకు సంబంధించిన 1392 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆమనగల్ ఏపీపీ బి కార్తీక్, న్యాయవాదులు, నాలుగు పోలీస్ స్టేషన్లకు సంబంధించిన సీఐలు, ఎస్ఐలు మరియు కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



## హర్యానాలో ఉడుతల జగన్‌కి గౌరవ డాక్టరేట్

**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 8 :** రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉడతల నరసింహ ఆండాలు దంపతుల కుమారుడు, ప్రజారోగ్య బాధితుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉడతల జగన్‌కి హర్యానా రాష్ట్రంలో అమెరికాకు చెందిన వాషింగ్టన్ డిజిటల్ యూనివర్సిటీ సోషల్ వర్క్ లో గౌరవ డాక్టరేట్ పట్టా ఇచ్చి అభినందనలు తెలియజేసింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఈ గౌరవ డాక్టరేట్ నా జీవితంలో గొప్ప గౌరవమని అని, కొన్ని ఏండ్ల నుంచి ప్రైవేట్ మరియు ప్రభుత్వ దవాఖానల్లో చికిత్స తీసుకుంటున్న ప్రజలకి తన అసోసియేషన్ ద్వారా ఆదుకున్నానని, కరోన కాలంలో ఎంతో మంది పేద, మధ్యతరగతి ప్రజలకి అండగా ఉన్నట్లు పేర్కొన్నారు.డాక్టరేట్ రావడం అనేది తన జీవితంలో ఇన్ని రోజుల కష్టానికి దక్కిన ఫలితం అన్నారు. తనను ఈ స్థాయిలో నిలబెట్టిన తల్లిదండ్రులు, సహకరించిన కుటుంబ సబ్యులు, అప్పారెడ్డిపల్లి గ్రామ ప్రజలకి అసోసియేషన్ సబ్యులకు హృదయ పూర్వకంగా అభినందనలు తెలిపారు.





## రోడ్డు బాగుచేసేది ఎన్నడు..?

### పాదచారులు వాహన దారులకు ఇక్కట్లు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం)జూన్ 08 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల పరిధిలోని తిమ్మాపూరం ఎక్స్ రోడ్డు నుంచి తిమ్మాపూరం గ్రామానికి వెళ్ళే రోడ్డు, రాయిగిరి–మోత్కూర్ మెయిన్ రోడ్డును విస్తరణ సమయంలో తిమ్మాపూరం వెళ్ళే రోడ్డును కలుపుతూ నిర్మాణం చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తిమ్మాపూరం వెళ్ళు రోడ్డు క్రిందికి ఉండటంతో మెయిన్ రోడ్డుపైకి రావాలన్నా, రోడ్డు దిగాలన్నా బ్రేక్ కట్టలా ఉండి ప్రమాదాలకు నిలయంగా మారింది. ద్విచక్ర వాహన దారులు ఎంతోమంది పడి గాయాలపాలయ్యారు. పాదచారులకు, ద్విచక్ర వాహన దారులకు, మోటారు కార్లు, భారీ వాహనాలు రోడ్డు ఎక్కాలన్నా.. దిగాలన్నా.. ఏన్నిజాగ్రత్తలు తీసుకుని ప్రయాణం చేస్తున్న మెయిన్ రోడ్డు వద్ద భారీ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుని అధికారులు తిమ్మాపూరం ఎక్స్ రోడ్డు నుంచి తిమ్మాపూరం వరకు రోడ్డకు ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని తిమ్మాపూరం గ్రామస్తులు కోరుతున్నారు.




## రాజీ మార్గమే రాజ మార్గం..

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి**

**విశ్వంభర, మహబూబ్ నగర్:** పెండింగ్ లో ఉన్న వివాదాలు,కేసులను మేఘా లోక్ అదాలత్ ద్వారా సామరస్యంగా రాజీ తో పరిష్కరించుకొనే రాజా మార్గాన్ని ఎంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి సూచించారు. స్థానిక జిల్లా కోర్టు సముదాయంలోని న్యాయ సేవా అధికార సంస్థ సమావేశం మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే కేసులకు తదుపరి అప్పీలు ఉండదని,కోర్టు ఫీజులను కూడా తిరిగి ఇస్తామని ఆయన తెలిపారు. ఇంతకు ముందు జరిగిన లోక్ అదాలత్ లో జంట నగరాలు కాకుండా రాష్ట్రంలోనే కేసులు పరిష్కారంలో మొదటి స్థానంలో నిలిచిందని, ఇందుకు పోలీస్ శాఖ,న్యాయవాదుల కృషి ప్రధానమైనదని ఆయన కొనియాడారు. ఈ లోక్ అదాలత్ ను కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జీ కార్యదర్శి ఇందిర తదితర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



## బాధితుల కుటుంబ సభ్యుల పట్ల అవహేళనగా మాట్లాడిన డిండి ఎస్ఐ

**విశ్వంభర, డిండి జూన్ 08:** మండల కేంద్రంలో ఓ కేసు విషయంలో మాట్లాడడానికి పోలీస్ స్టేషన్‌కు విచ్చేసిన నిందితుల కుటుంబ సభ్యులతో అవహేళనగా మాట్లాడిన డిండి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. వివరాల్లోకెళ్తే డిండి మండలం గోనబోయినపల్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ రంగడంపల్లి కృష్ణయ్య(78) ఫిబ్రవరి 8వ తేదీన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న కేసు విష యంలో మాట్లాడానికి బాధితుల కుటుంబ సభ్యులు శనివారం డిండి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో బాధితుల కుటుంబ సభ్యులు మహిళలు పోలీస్ స్టేషన్లో ఎస్సై రాజును కలిసి తమ బాధను చెబుతుండగా ఎస్సై పరుష పదజాలంతో మహిళలు అని చూడకుండా వారితో మాట్లాడాడని బాధితులు తెలిపారు. మ హిళలు అని చూడకుండా అమర్యాదగా ప్రవర్తించిన ఎస్సై తీరుపట్ల మహిళలు ఆవేదన చెందుతూ తమగోడును విలేకరుల ముందు వెళ్లబుచ్చారు. ఉన్నతాధికారులు ఎస్సై తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని బాధితుల కుటుంబ సభ్యులు పందుల కృష్ణమ్మ, రగడంపల్లి అలివేలు, రగడంపల్లి అనూష, రగడంపల్లి లక్ష్మి, రగడంపల్లి చిన్ననారయ్య, బర్పటి పెద్ద పెద్దయ్య కోరారు. ఈ విషయంలో ఎస్ఐ రాజుని వివరణ కోరగా.. నిందితుల కుటుంబ సభ్యుల పట్ల అమర్యాదగా మాట్లాడలేదని ఆయన పేర్కొన్నారు.




## యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2024 ప్రిలిమ్స్ పరీక్ష అడ్మిట్ కార్డులు విడుదల

**విశ్వంభర, హైదరాబాద్ :** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష 2024 కోసం అడ్మిట్ కార్డ్‌లను విడుదల చేసింది. పరీక్ష కోసం రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ (upsc.gov.in) లేదా (upsconline.nic.in) నుంచి కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.అడ్మిట్ కార్డ్‌లను యాక్సెస్ చేయడానికి గడువు జూన్ 16, 2024. అభ్యర్థులు ఎగ్జామ్ హాల్‌లోకి ప్రవేశించడానికి వారి ఇ-అడ్మిట్ కార్డ్‌తో పాటు (ఒరిజినల్) ఫొటో ఐడెంటిటీ కార్డును సమర్పించాల్సి ఉంటుంది. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, 2024 తుది ఫలితాలు ప్రకటించే వరకు కార్డ్ తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలి. యూపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ కూడా పరీక్షా వేదికలోకి విద్యార్థుల ప్రవేశం పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందు క్లోజ్ అవుతుందని పేర్కొంది. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ 2024 పరీక్ష జూన్ 16, 2024న నిర్వహించనున్నారు. పరీక్ష గతంలో మే 26న షెడ్యూల్ అయింది. ఏప్రిల్-జూన్ 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల కారణంగా పరీక్ష టైమ్‌టేబుల్‌ను మార్చాలని నిర్ణయం తీసుకుంది.

ఈ 2024 ఏడాదిలో కమిషన్ సీఎస్ఈలో మొత్తం 1,056, (IFoS) కోసం 150 ఖాళీలను ప్రకటించింది. గత ఏడాదిలో 1,105 పోస్టుల కన్నా తక్కువగా ఉంది. అయితే, 2021లో 712, 2020లో 796 ఖాళీలు ఉన్నాయి. సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలు రెండు పేపర్‌లను ఉంటాయి. ఆబ్జెక్టివ్ టైప్ (మల్టీపుల్ ప్రశ్నలు), సెక్షన్ 2లోని సబ్-సెక్షన్ (A)లో పేర్కొన్న సబ్జెక్టులలో గరిష్టంగా 400 మార్కులు ఉండాలి. ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నాపత్రాలలో అభ్యర్థులు గుర్తించిన తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

# కేంద్ర మంత్రివర్గంలో 50 శాతం బీసీలకు ఇవ్వాలి

- రాష్ట్రం నుంచి ముగ్గురు బీసీలకు ఇవ్వాలి
- బి.సి సంఘాల డిమాండ్



**విశ్వంభర, ముషీరాబాద్:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీసీ కులాలకు చెందిన వారు కావడంతో దేశంలో ఉన్న మెజార్టీ బీసీలు బిజెపి కి మద్దతు ఇచ్చారని బీసీ సంఘాల నాయకులు అన్నారు. కేంద్ర మంత్రివర్గంలో బీసీలకు 50 శాతం మంత్రి పదవులు, ముఖ్యమైన శాఖలు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, గుజ్జ కృష్ణ అధ్యక్షతన శనివారం కాచిగూడలో 13 బి.సి సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలు మెజార్టీ శాతం నరేంద్ర మోడీని చూసి ఓట్లు వేశారన్నారు. అందుకే 8 సీట్లు గెలిచారని, మన రాష్ట్రంలో 3 మంత్రి పదవులు బీసీలకు కేటాయించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీసీల డిమాండ్లు నెరవేర్చడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మంత్రివర్గంలో ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా దేశంలోనే బీసీలకు 70 కోట్ల మందికి విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి విధానపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బిసి వ్యతిరేకత మార్చుకోవాలని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. బీసీలకు ఏ రంగంలో కూడా ప్రజాస్వామిక విద్యా, ఉద్యోగ, ఆర్థిక వాటా ఇవ్వలేదన్నారు. అలాగే రాజకీయ, పారిశ్రామిక జనాభా ప్రకారం వాటా ఇవ్వడం లేదన్నారు. 76 సంవత్సరాలుగా బీసీలకు అన్యాయం చేశారని ఇప్పటికీ న్యాయం చేయాలని ఆలోచించడం లేదని చెప్పారు. భారతదేశంలో అనేక సెంటిమెంట్లతో ఇంకా ప్రజలను తప్పుదారి పట్టించడం, మభ్య పెడుతామనే ఆలోచనలు మానుకోవాలని హెచ్చరించారు. ప్రజలను అన్ని రంగాలలో అభివృద్ధి పరచాలని దృడ నిర్ణయం చేయడానికి జాతీయ పార్టీలు ముందుకు రావాలని ముఖ్యంగా బీజేపీ పార్టీ రావాలని ఆర్ కృష్ణయ్య కోరారు.

స్వతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడిచిన ఈ దేశంలో పేద బీసీ కులాలకు అన్ని రంగాలలో సమాన వాటా లభించడం లేదని ఇంకా ఈ దేశంలో ప్రపంచ బ్యాంక్ సర్వే ప్రకారం 49 శాతం జనాభా పేదరికం క్రింద జీవిస్తున్నారని చెప్పారు. 29 శాతం ప్రజలు నిరక్ష రాశ్యులుగా చదువుకు నోచుకోకుండా ఉన్నారని బిసి జాబితాలోని 2652కులాలలో 1849 కులాలు పదవ తరగతి వరకు కూడా చదువుకోలేదన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలు శరవేగంతో అభివృద్ధి చెందుతుంటే మనదేశంలో నిరక్షరాస్యత, పేదరికం, అమాయకత్వంతో ప్రజలు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో అనేక ప్రభుత్వాలు మారుతున్న బిసిల వాటా బిసిలకు లభించడం లేదన్నారు. కొత్త ప్రభుత్వం బిసిల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు నీల వెంకటేష్, రాజేందర్ జిల్లపల్లి అంజి, చౌటుపల్లి సురేష్, నందగోపాల్, రామకృష్ణ అనంతయ్య , ఉదయ్, మహిళా నాయకురాలు జయంతి, నిఖిల్, రాజ్ కుమార్ , ప్రీతం తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్-1 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**డీఎస్పీ బాలకృష్ణారెడ్డి**

**విశ్వంభర, తాండూరు :** గ్రూప్-1 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ..తాండూరులో 4పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 1.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 2.సింధూ డిగ్రీ కాలేజీ, 3.సింధూ బాలికల జూనియర్ కళాశాల, 4.సిద్దార్థ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో మొత్తం 1488 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు .పరీక్ష పేపర్లను స్ట్రాంగ్ రూంకు తరలించేందుకు రూట్ ఏర్పాటుచేశామన్నారు. పరీక్ష రోజున కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ పక్కాగా ఉంటుందన్నారు. కేంద్రా ల వద్ద పార్కింగ్ స్థలాలను గుర్తించిన ప్రదేశంలో మాత్రమే అభ్యర్థులు వాహనాలు నిలపాలన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఎలాంటి మైక్ శబ్దాలు లేకుండా చీఫ్ సూపరింటెండెంట్లు ముందు రోజే తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

### కేంద్రాల వద్ద 144 సెక్షన్ ..

పరీక్ష కేంద్రాలపై తనతో పాటు టౌన్, రూరల్ సీఐల పర్యవేక్షణ ఉంటుందన్నారు. అలాగే ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఎస్సైతోపాటు కానిస్టేబుల్ల బందోబస్తు ఉంటుందన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్తగా పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల వద్ద ప్రజలు అధిక సంఖ్యలో గూమి కూడవద్దని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని అదేశించారు.



## సాయి బాబా ఆలయంలో మంత్రి జూపల్లి పూజలు

**విశ్వంభర, చింతపల్లి జూన్ 09:** చింతపల్లి శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో 17వ వార్షికోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఉదయాన్నే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాధుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవాల్లో శనివారం ఉదయం నుంచి మంటపారధనలు, హవనములు, తీర్థ ప్రసాదాలు, గండ బేరుండ లక్ష్మీ నారసింహ హోమం, సాయి కృష్ణగోకులం (గోశాల), లక్ష్మీకామధేను హోమము, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బాబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య మంత్రికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి, బాబా చిత్ర పటాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాయినాధుని కృపా కటాక్షాలు రాష్ట్ర ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొమిరిశెట్టి వెంకటయ్య, ఊరే కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్, జయరాములు, గోవిందు గిరి, కోప్పుల తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి పల్లకీ సేవ

**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 8** : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయానికి వచ్చిన భక్తులకు అంతిరెడ్డిగుడ గ్రామానికి చెందిన భూనేటి యశోద, వెంకటేష్ గౌడ్ దంపతులు తన తండ్రి గడ్డమీద రామచంద్రయ్య గౌడ్ జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. అదేవిధంగా దేవాలయంలో భక్తుల సహాయార్థం పట్టణంలోని 7వ వార్డుకు చెందిన మంచిరేవుల అశోక్, చెన్నయ్య కలిసి 5 టేబుళ్లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులిమామిడి శ్రీశైలంగౌడ్, బూనేటి యశోద, వెంకటేశ్‌గౌడ్, మంచిరేవుల అశోక్‌లకు కృతజ్ఞతలు తెలిపి పూలమాలతో సన్మానం చేశారు. దేవాలయ అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలం గౌడ్, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, రఘునందన్ రెడ్డి, లక్ష్మణ్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మికాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకర్ గౌడ్, వీఆర్వో బచ్చన్న, యాదగిరి, పీ ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేశ్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## నాణ్యమైన విత్తనాల కొరత లేకుండా చూడాలి

- వ్యవసాయ శాఖ అధికారుల సమీక్ష...
- సమావేశంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్.

**విశ్వంభర,మహబూబాబాద్ టౌన్ :** నాణ్యమైన విత్తనాలు ఎరువుల కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని నిబంధనల మేరకు జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయి ఏఈఓ లు రైతులకు వానాకాలం పంటల పైన అవగాహన కల్పించాలని అన్నారు. వ్యవసాయశాఖ అధికారులతో విత్త నాలు ఎరువులపై జిల్లా లోని రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి విత్తన దుకాణాలను క్షుణంగా తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వానకాలానికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన పడవద్దు అని ఏదైనా సమస్య ఉన్నట్లయితే వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించుకోవాల్సిందిగా కలెక్టర్ రైతులకు సూచించారు..జిల్లా లో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ టీములు, రెవెన్యూ అధికారులు టీమ్ గా ఏర్పాటు చేసి విత్తనాల దుకాణాలను తరచుగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లాలో ఉన్న డీలర్లు వారి నియమ నిబంధనలు పాటిస్తూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులను విక్రయించాలని, నిబంధనలు పాటించని విత్తన డీలర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నకిలీ విత్తనాల పై నిఘా పెట్టి, ఎవరైన నకిలీ విత్తనాలు విక్రయించినట్లయితే వారిపై విత్తన చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అభిమన్యుడు వివిధ మండలాల వ్యవసాయ శాఖ ఏ ఇ ఓ లు తదితరులు పాల్గొన్నారు.



## రెడ్‌క్రాస్ సోసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**విశ్వంభర, హైదరాబాద్:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ మామిడి భీంరెడ్డి మరియూ క్యాంప్ కో కన్వీనర్ కే కళావతి ఆధ్వర్యంలో శనివారం శ్రీ వెంకటేశ్వర, శ్రీ హనుమాన్ గుడి బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 14లో 60 సంవత్సరాల పైబడిన వారి కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా డాక్టర్, శ్రీజరెడ్డి, డాక్టర్ హారి ప్రియ రోగులను పరీక్షించి చికిత్స చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కే విజయకుమారి, ఎంసీ మెంబర్ కే నాగేంద్ర, సుబ్బ లక్ష్మి, విజయ, ధర్మ తేజ, సతీష్, సుజాత, సత్యనారాయణ, సందీప్, గోపాల్ తదితరులుపాల్గొన్నారు.



# రాజీనామాకు సిద్ధమైన డిప్యూటీ సీఎం ఫడ్నవీస్..

- మహారాష్ట్ర ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమికి భారీ షాక్
- ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామాకు సిద్ధమైన దేవేంద్ర ఫడ్నవీస్
- ఫడ్నవీస్ రాజీనామా ప్రతిపాదనను తిరస్కరించిన షా
- రాజీనామాతో బీజేపీ కార్యకర్తల నైతిక స్థైర్యం దెబ్బతింటుందని వ్యాఖ్యలు

**విశ్వంభర, ముంబై:** సార్వత్రిక ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పు అధికార మహాయుతి కూటమికి భారీ షాక్ ఇచ్చింది. డిప్యూటీ సీఎం దేవంద్ర ఫడ్నవీస్ సారథ్యంలోని బీజేపీ, ఏక్‌నాథ్ శిండే వర్గం, అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ కూటమికి ఈ ఎన్నికల్లో కేవలం 17 సీట్లు దక్కగా కాంగ్రెస్, శివసేన(యూబీటీ), ఎన్సీపీ (శరత్‌చంద్రపవార్) పార్టీలతో కూడిన ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. గత ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి 48 స్థానాలకు ఏకంగా 40 స్థానాలు దక్కాయి. ఈ నేపథ్యంలో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామాకు సిద్ధమవగా హోం మంత్రి అమిత్ షా వారించినట్లు తెలుస్తోంది. ఆయన రాజీనామా ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించినట్లు సమాచారం. దేవేంద్ర ఫడ్నవీస్ తో స్వయంగా మాట్లాడిన అమిత్ షా రాజీనామా ఆలోచనను ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారట. శుక్రవారం నాటి ఎన్డీయే సమావేశం తరువాత బీజేపీ నేతలు పలువురు సీఎం ఏక్‌నాథ్ శిండేతో పాటు మరో డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌తో భేటీ అయ్యారు. ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఫలితాలు రావడంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తాను రాజీనామాకు సిద్ధమని దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నట్లు సమాచారం. ఆ తరువాత ఫడ్నవీస్.. హోం మంత్రిని ఆయన నివాసంలో కలిశారట. ఈ సందర్భంగా అమిత్ షా మరోసారి ఫడ్నవీస్ రాజీనామా ప్రతిపాదనను తిరస్కరించడమే కాకుండా రాష్ట్రంలో బీజేపీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రణాళిక రూపొందించాలని కూడా దిశానిర్దేశం చేశారట. "మీరు రిజైన్ చేస్తే బీజేపీ శ్రేణుల నైతిక స్థైర్యం దెబ్బతింటుంది. కాబట్టి రాజీనామా చేయొద్దు" అని షా స్పష్టం చేసినట్లు సమాచారం. ప్రధాని ప్రమాణ స్వీకారం తరువాత ఈ విషయమై మరింత కూలంకషంగా చర్చిద్దామని కూడా షా చెప్పినట్లు తెలిసింది. మరో నాలుగు నెలల్లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ..ఈ ఓటమి నుంచి ఎలా తేరుకుంటుందనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.





## భారీ అగ్ని ప్రమాదం.. ముగ్గురు సజీవ దహనం

**విశ్వంభర, ఢిల్లీ:** రాజధాని ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. నరేలా ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ ఫ్యాక్టరీలో శనివారం తెల్లవారుజామున 3.35గంటలకు ఈ సంఘటన జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో ముగ్గురు మంటల్లో సజీవ దహనమయ్యారు. మరో తొమ్మిది మందికి తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాద విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకునిమంటలను అదుపు చేశారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతులు జగదీష్ కుమారుడు శ్యామ్ (24), గిర్జా శంకర్ కుమారుడు రామ్ సింగ్ (30), రాజారాం కుమారుడు బీరా పాల్ (42)గా గుర్తించారు. రాకేష్ శర్మ, కన్హయ్య లాల్, రాజు కుష్వాహ, జైకిషన్, జగదీష్ నారాయణ్ శర్మ, బన్ లాల్ కుష్వాహ గాయాలపాలైన వారిలో ఉన్నారు. పైప్‌లైన్‌లో గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు వ్యాపించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఫ్యాక్టరీ యజమానులు అంకిత్ గుప్తా, వినయ్ గుప్తాలను విచారిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నా రాజకీయ వారసుడు అతడు కాదు..



**నవీన్ పట్నాయక్ సంచలన వ్యాఖ్యలు**

**విశ్వంభర, ఒడిశా:** ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ తన రాజకీయ వారసుడి గురించి మీడియా ముఖంగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దశాబ్దాల కాలంగా ఒడిశా సీఎంగా ఉన్న నవీన్ పట్నాయక్ మొన్నటి ఎన్నికల్లో పరాభవం ఎదురవ్వడంతో తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తన రాజకీయ వారసుడి గురించి ఎప్పుడు అడిగినా నేను ఒకటే చెబుతానని, నా రాజకీయ వారసుడు మిస్టర్ పాండియన్ కాదని, దానిని ఒడిశా ప్రజలే నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. మిస్టర్ పాండియన్ పై కొన్ని విమర్శలు వచ్చినట్లు తన దృష్టికి వచ్చిందని, ఇది చాలా దురదృష్టకరమని ఆయన అన్నారు. పాండియన్ గత పది సంవత్సరాలలో రెండు తుఫానులు, కోవిడ్-19 లోను అందరికీ సహాయం చేస్తూ.. అనేక రంగాలలో అద్భుతంగా పని చేశాడని తెలిపారు. పాండియన్ పార్టీలో చేరిన నాటినుంచి ఏ పదవీ అనుభవించలేదని, ఈ ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదని గుర్తుచేశారు. అలాగే ఆయన నీతి నిజాయితీ గల వ్యక్తి అని గుర్తుంచుకోవాలన్నారు. ఒడిశా ప్రజలు పదే పదే నన్ను ఆశీర్వాదించారని, వారి ఆశీర్వాదాలతో వారికి సేవ చేసేందుకు నాకు అనుమతి నిచ్చినందుకు ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఎల్లప్పుడు అద్భుతమైన పని చేయడానికి ప్రయత్నించామని, మా ప్రభుత్వం గురించి, పార్టీ గురించి గర్వపడాల్సిన అవసరం ఉందని నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు.



## లోక్ సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ...

**సీడబ్ల్యూసీ తీర్మానం**

**విశ్వంభర, ఢిల్లీ :** లోక్ సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని ఎన్నుకునేందుకు సీడబ్ల్యూసీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ అంగీకరించే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటానని రాహుల్ గాంధీ చెప్పినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. శనివారం ఢిల్లీలో సీడబ్ల్యూసీ విస్తృత సమావేశం జరిగింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మనీశ్ తివారీ, డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేతగా సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది. సీడబ్ల్యూసీ సమావేశం అనంతరం ఆ పార్టీ నేత కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ... రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా ఉండాలని తామంతా కోరుకుంటున్నామన్నారు. ఇది వర్కింగ్ కమిటీ అభ్యర్థన అన్నారు. ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ కృషిని కూడా సీడబ్ల్యూసీ కొనియాడినట్లు చెప్పారు.



## మోడీ ప్రమాణ స్వీకారానికి వచ్చే వివిధ దేశాల అధ్యక్షులు వీరే..!

**విశ్వంభర, ఢిల్లీ:** భారతదేశానికి మూడోసారి ప్రధానిగా నరేంద్రమోడీ ఇప్పటికే ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాణస్వీకారానికి అన్ని ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. ఈ వేడుక రేపు అంటే జూన్ 9న రాత్రి 7:15 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో జరగబోతుంది. కాగా ఈ వేడుకకు వివిధ దేశాల అధ్యక్షులకు ఆహ్వానం కూడా వెళ్లింది. ఆహ్వానం అందుకున్న వారంతా ఇప్పటికే తమ రాకను ధృవీకరించారు. దాంతో ఢిల్లీలోని ప్రముఖ లీలా, తాజ్, ఐటీసీ మౌర్య, క్లారిడ్జ్, ఒబెరాయ్ లాంటి ప్రధాన హోటళ్ల దగ్గర అతిథులకు విడిది ఏర్పాటు చేస్తున్నారు. వారందరికీ ఇప్పటికే భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే బంగ్లాదేశ్ ప్రధాని, సీషెల్స్ అధ్యక్షుడు ఈరోజు న్యూఢిల్లీకి బయలు దేరారు. మిగతా వారంతా రేపు సాయంత్రానికల్లా ఢిల్లీకి చేరుకుంటారు. ఆ తర్వాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన విందులో పాల్గొంటారు.

ఈ కార్యక్రమం సార్క్ (సౌత్ ఏషియన్ అసోసియేషన్ ఫర్ రీజినల్ కోఆపరేషన్) సభ్య దేశాల మధ్య ప్రాంతీయ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది. అయితే మోడీ ప్రమాణస్వీకారానికి శ్రీలంక అధ్యక్షుడు- రణిల్ విక్రమసింఘే, మాల్దీవుల అధ్యక్షుడు- మహ్మద్ ముయిజ్జూ, సీషెల్స్ ఉపాధ్యక్షుడు- అహ్మద్ అఫీఫ్, బంగ్లాదేశ్ ప్రధాని-షేక్ హసీనా, మారిషస్ ప్రధాని-ప్రవింద్ కుమార్ జుగ్నాథ్, నేపాల్ ప్రధాన మంత్రి-పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ', భూటాన్ ప్రధాని-షెరింగ్ టోబ్గే రాబోతున్నారు.



## ఆ వ్యక్తి బర్డ్ ఫ్లూతో చనిపోలేదు: డబ్ల్యూహెచ్‌వో

**విశ్వంభర, ఢిల్లీ:** ఇటీవల బర్డ్ ఫ్లూతో తొలి మరణం సంభవించిందని ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆ మాటను వెనక్కి తీసుకుంది. ఆ వ్యక్తి బర్డ్ ఫ్లూ వల్ల చనిపోలేదని తేల్చిచెప్పింది. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ తాజాగా ఓ ప్రకటనను విడుదల చేసింది. పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించిన తర్వాత ఆ వ్యక్తికి దీర్ఘకాలిక మూత్రపిండ సమస్యలు ఉన్నట్లు గుర్తించామని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. అదేవిధంగా టైప్ 2 మధుమేహం, రక్తపోటు సమస్యలు ఉన్నాయని వెల్లడించింది. మరోవైపు దేశంలో కొన్ని రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ కలకలం రేపుతున్న విషయం తెలిసిందే. దీంతో ఈ వ్యక్తి లక్షణాలను బట్టి బర్డ్ ఫ్లూతో చనిపోయి ఉండవచ్చని భావించినట్లు తెలిపింది. అయితే, ఈ అతడి మరణానికి అనేక కారణాలు ఉన్నాయని వివరించింది. హెచ్ 5ఎన్ 2కి ఆపాదించబడిన మరణం కాదని స్పష్టం చేసింది.



## 'రెండు వారాల్లోగా రాహుల్ ఒక సీటుకు రాజీనామా చేయాలి

- లేదంటే రెండింటికీ అనర్హత!'

**విశ్వంభర, ఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన రెండు నియోజక వర్గాల నుంచి గెలుపొందిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ స్థానానికి రాజీనామా చేస్తారనే విషయం ఆసక్తికరంగా మారింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి రెండు వారాల్లోగా(14 రోజులు) ఆయన దీనిపై నిర్ణయం తీసుకుని తన రాజీనామా లేఖను లోక్‌సభ సభాపతికి పంపించాల్సి ఉంటుందని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్, రాజకీయ నిపుణుడు పీడీటీ ఆచారి తెలిపారు. ఆ గడువులోగా లేఖను పంపించకపోతే ప్రస్తుతం ఎన్నికైన వయనాడ్ (కేరళ), రాయ్ బరేలీ (ఉత్తర్‌ప్రదేశ్) స్థానాలు రెండింటికీ ఆయన అనర్హులయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులు ఖాళీగా ఉంటే రాహుల్ తన రాజీనామాను ఎన్నికల సంఘానికి పంపవచ్చని ఆచారి తెలిపారు. కేంద్ర మంత్రి మండలి సిఫార్సుతో జూన్ 5న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 17వ లోక్‌సభను రద్దు చేసినప్పటికీ 18వ లోక్‌సభకు ప్రొటెం స్పీకర్ నియమితులయ్యే వరకు ప్రస్తుత స్పీకర్ ఓం బిర్లా కొనసాగుతారు. ఏ సీటుకు తాను రాజీనామా చేస్తున్నారో తెలుపుతూ జూన్ 18ల తేదీ లోగా రాహుల్ లేఖ రాయాల్సి ఉంటుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ఒక వ్యక్తి గరిష్ఠంగా రెండు నియోజకవర్గాల నుంచి ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. రెండు నియోజకవర్గాల్లోనూ విజయం సాధిస్తే ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది.



## యూపీలో 11 నుంచి కాంగ్రెస్ ధన్యవాద్ యాత్ర

- యూపీలో బీజేపీకి మించి సీట్లు గెలుచుకున్న ఇండియా కూటమి
- తమను ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు చెప్పాలని కాంగ్రెస్ నిర్ణయం
- మొత్తం 403 నియోజకవర్గాల్లోనూ యాత్ర

**విశ్వంభర, యూపీ:** లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో అనూహ్యంగా పుంజుకున్న కాంగ్రెస్ పార్టీ.. తమను అక్కున చేర్చుకున్న యూపీ ప్రజలకు ధన్యవాదాలు తెలిపేందుకు యాత్ర చేపట్టాలని నిర్ణయించింది. ఈ నెల 11 నుంచి 15 వరకు రాష్ట్రంలోని 403 నియోజకవర్గాల్లో 'ధన్యవాద్ యాత్ర' చేపట్టాలని నిర్ణయించింది. సీనియర్ నేతలు, కార్యకర్తలు ఈ యాత్రలో పాల్గొంటారని సమాచారం. ఈ యాత్ర సందర్భంగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలకు రాజ్యాంగ పుస్తకాన్ని బహూకరించి గౌరవిస్తారు. ఉత్తరప్రదేశ్‌లోని 80 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 8 గెలుచుకోగా, మిత్రపక్ష సమాజ్‌వాదీ పార్టీ 37 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది.

## ఎవరీ ఐశ్వర్య మీనన్..!



**మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమెను ఎందుకు ఆహ్వానించారు?**

**విశ్వంభర, ఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మరోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. దీంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మోదీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సుమారు 8వేల మంది అతిథులు హాజరయ్యే అవకాశం ఉంది. వీరిలో పొరుదేశాల అధినేతలతోపాటు.. దేశంలోని పలు రంగాల ప్రముఖులు, రాజకీయ నేతలు ఉన్నారు. ఇప్పటికే వీరికి ఆహ్వానాలు సైతం వెళ్లారు. మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని వందేభారత్ లోకో పైలట్ ఐశ్వర్య ఎస్ మీనన్‌కు కూడా అధికారులు ఆహ్వానాన్ని అందించారు. దీంతో ఐశ్వర్య ఎస్ మీనన్ ఎవరు అనే చర్చ జరుగుతుంది. ఐశ్వర్య ఎస్ మీనన్ దక్షిణ రైల్వేలోని చెన్నై డివిజన్ సీనియర్ అసిస్టెంట్ లోకో పైలట్. వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లలో, జన శతాబ్ది వంటి వివిధ రైళ్లలో పైలట్ గా చేస్తూ రెండు లక్షలకుపైగా ఫుట్‌ప్లేట్ గంటలను పూర్తి చేశారు. చెన్నై – విజయవాడ, చెన్నై – కోయంబత్తూరు వందే భారత్ ఎక్స్ ప్రెస్ సర్వీసులలో కూడా మీనన్ పనిచేశారు. మీనన్ తన చురుకుదనంతో రైల్వే సిగ్నలింగ్ పై సమగ్ర పరిజ్ఞానంతో నాణ్యమైన సేవలు అందిస్తూ సీనియర్ అధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి దాదాపు పది మంది లోకో పైలట్లకు ఆహ్వానం అందింది. వారిలో ఐశ్వర్య మీనన్ తో పాటు ఆసియాలోనే తొలి మహిళా లోకో పైలట్ సురేఖ యాదవ్ కూడా ఉన్నారు. సురేఖ యాదవ్ 1988లో భారతదేశం తొలి మహిళా లోకో పైలెట్ గా చరిత్ర సృష్టించారు. అదేవిధంగా సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్దిదారులు తదితరులు పెద్ద సంఖ్యలో మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకానున్నారు.

## డెన్మార్క్ మహిళా ప్రధానిపై దాడిని ఖండించిన మోదీ

- డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడరిక్సన్ పై ఆగంతుకుడి దాడి
- ప్రధానిని మరో ప్రాంతానికి తరలించిన భద్రతా సిబ్బంది
- దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్
- ఇలాంటి దాడులను సమర్థించబోమన్న భారత ప్రధాని మోదీ



**విశ్వంభర, ఢిల్లీ :** డెన్మార్క్ మహిళా ప్రధాని మెట్టే ఫ్రెడరిక్సన్ పై దాడి జరిగింది. డెన్మార్క్ రాజధాని కోపెన్ హేగెన్ నగరంలోని కుల్టోర్వెట్ స్క్వేర్ వద్ద ఓ దుండగుడు అకస్మాత్తుగా ప్రధాని మెట్టే ఫ్రెడరిక్సన్ పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఫ్రెడరిక్సన్ దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ దాడి జరిగిన వెంటనే ప్రధానిని భద్రతా సిబ్బంది మరో ప్రాంతానికి తరలించారు. దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు డెన్మార్క్ ప్రధాని కార్యాలయం వెల్లడించింది. ప్రధాని మెట్టే ఫ్రెడరిక్సన్ కు ఏమైనా గాయాలయ్యాయా అనే అంశంపై స్పష్టత లేదు. కాగా, ఈ దాడి ఘటనను భారత ప్రధాని నరేంద్ర మోదీ ఖండించారు. డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడరిక్సన్ పై దాడి తీవ్ర ఆందోళన కలిగించిందని వెల్లడించారు. ఇలాంటి దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని మోదీ స్పష్టం చేశారు. మిత్రురాలు మెట్టే ఫ్రెడరిక్సన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు ట్వీట్ చేశారు.

## మోడీ ప్రమాణస్వీకారానికి మాకు ఆహ్వానం అందలేదు : జైరాం రమేష్



**విశ్వంభర, ఢిల్లీ :** నరేంద్ర మోడీ వరుసగా మూడోసారి భారత ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయనున్న తరుణంలో సామాన్యుల నుంచి మొదలుకుని విదేశీ నేతలకు ఆహ్వానాలు అందాయి. ఆదివారం జరగనున్న ఈ వేడుకకు దేశ రాజధానిని సిద్ధం చేస్తున్నారు. అతిథుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత జైరాం రమేష్ శనివారం ఒక మీడియా సమావేశంలో మాట్లాడుతూ, నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఇండియా కూటమి నేతలకు ఇంకా ఆహ్వానం అందలేదని అన్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి అంతర్జాతీయ నేతలను మాత్రమే ఆహ్వానించారని, మా నేతలకు ఇంకా ఆహ్వానం అందలేదని తెలిపారు. ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా, ఆయన మాట్లాడుతూ, ఇండియా కూటమి నేతలకు ఆహ్వానాలు అందినప్పుడు ఆ వేడుకకు వెళ్లడం గురించి ఆలోచిస్తామని పేర్కొన్నారు. 'నైబర్ హుడ్ ఫస్ట్' విధానానికి, 'సాగర్' విజన్కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, మోడీ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరు కావాలని భారత పక్కన ఉన్న దేశాల నేతలకు ఇప్పటికే ఆహ్వానాలను పంపగా వారు కూడా ఈ వేడుకకు రానున్నట్లు తాజాగా ధృవీకరించారు. ఇదిలా ఉంటే, శనివారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో లోక్సభలో ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీని నియమించాలని ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు.

## జేడీయూ నుంచి ఇద్దరికి ఎన్డీయే క్యాబినెట్ బెర్తులు!



**విశ్వంభర, పాట్నా:** మూడో పర్యాయం ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ రేపు ప్రమాణస్వీకారం చేయనుండగా, క్యాబినెట్ కూర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మంత్రివర్గ సహచరుల జాబితాను మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించాల్సి ఉంది. నిన్న జేపీ నడ్డా, అమిత్ షా, రాజ్ నాథ్, చంద్రబాబు, నితీశ్ కుమార్ వంటి ఎన్డీయే పెద్దలు కేంద్ర క్యాబినెట్ కూర్పుపై చర్చించారు. ఈ నేపథ్యంలో కొంత కీలక సమాచారం బయటికి వచ్చింది. నితీశ్ కుమార్ సారథ్యంలోని జేడీయూ నుంచి ఇద్దరికి కేంద్ర మంత్రి పదవులు ఖరారైనట్టు తెలుస్తోంది. జేడీయూ ఎంపీలు లలన్ సింగ్, రామ్ నాథ్ ఠాకూర్ లకు మోదీ క్యాబినెట్ లో చోటు లభించిందంటూ జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

ఈ ఎన్నికల్లో బీజేపీకి 240 స్థానాలు రాగా, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు టీడీపీ 16, జేడీయూ 14 లోక్ సభ స్థానాల్లో విజయం సాధించాయి. బీజేపీ సొంతంగా మ్యాజిక్ ఫిగర్ సాధించలేకపోవడంతో మిత్రపక్షాల మద్దతు కీలకంగా మారింది. అందుకే, రెండంకెల్లో ఎంపీ స్థానాలు గెలిచిన టీడీపీ, జేడీయూలకు మోదీ 3.0 క్యాబినెట్లో సముచిత స్థానం లభించే అవకాశాలున్నాయి.

# రామోజీ రావుకు ఆంధ్ర ప్రముఖుల నివాళి



**విశ్వంభర, విజయవాడ:** ఈనాడు సంస్థల ఛైర్మన్ రామోజీ రావుకు ఏపీ ప్రభుత్వం ఘనంగా నివాళులర్పించింది. రామోజీరావు మృతికి నివాళిగా రెండు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించింది. ఆది, సోమవారాలను సంతాప దినాలను ప్రకటిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు రోజుల పాటు ఎటువంటి అధికారిక కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించదు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు.ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు ఇవాళ ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్‌సిటీకి తరలించగా.. ఆయనకు నివాళులు అర్పించేందుకు పెద్ద సంఖ్యలో సినీ, రాజకీయ ప్రముఖులు తరలివస్తున్నారు.

### త్వరలోనే కలుద్దామనుకున్నాం.. ఇంతలోనే ఇలా : పవన్ కళ్యాణ్

రామోజీరావు మృతి పట్ల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. ఫిల్మ్ సిటీలో రామోజీరావు పార్థివదేహానికి ఆయన నివాళి అర్పించారు. మోదీ ప్రమాణస్వీకారం తర్వాత వచ్చి రామోజీరావును కలవాలని అనుకున్నా.. కానీ ఇంతలోనే ఇలా జరిగిపోయిందని పవన్ కన్నీటిపర్యంతం అయ్యారు. రామోజీరావుని ఇబ్బంది పెట్టిన ప్రభుత్వం ఇప్పుడు లేదని పవన్ కళ్యాణ్ అన్నారు. రామోజీరావు మరణ వార్త తెలిసిన వెంటనే పవన్ కళ్యాణ్ అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని ఢిల్లీ నుంచి బయలుదేరి వచ్చారు. రాగానే రామోజీ ఫిలింసిటీకి చేరుకుని రామోజీ భౌతికకాయానికి అంజలి ఘటించారు.

"గత దశాబ్ద కాలంలో ప్రభుత్వాలు ఆయనను చాలా ఇబ్బంది పెట్టాయి. ఆయన అన్నీ తట్టుకున్నారు. ప్రజలను చైతన్యవంతం చేశారు. ప్రజలకు అండగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తి. వేలాది మంది జర్నలిస్టులను తెలుగు రాష్ట్రాలకు అందించిన మహానుభావుడు. హైదరాబాద్ లో తెలుగు చిత్ర పరిశ్రమ ఇంత అద్భుతంగా ఉందంటే.. ఆయన కాంట్రిబ్యుషన్ ఎనలేనిది. అలాంటి వ్యక్తిని ప్రభుత్వాలు గత 15 సంవత్సరాలలో చాలా ఇబ్బంది పెట్టాయి. వాటన్నింటిని తట్టుకున్నారు. ఆయనను ఇబ్బంది పెట్టిన ప్రభుత్వాలు ఇవాళ లేవు. ఆ విజయం ఆయనకు తెలియజేయాలి అనుకున్నాం. ఈలోపే ఇలా జరిగిపోయింది. ఇది దురదృష్టకరం. రామోజీ కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూప్ ఆఫ్ కంపెనీలకు జనసేన, నా తరపున సంతాపం తెలుపుతున్నా. ఈ సమయంలో రామోజీ కుటుంబసభ్యులకు దేవుడు అండగా ఉండాలని కోరుకుంటున్నా".

## రామోజీరావు లేరనే వార్త ఆవేదన కలిగిస్తోంది.. బాలకృష్ణ

తెలుగు మీడియా దిగ్గజం రామోజీ రావు మరణంపై హిందుపురం ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలోని రామోజీ భౌతికాయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి బాలయ్య నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రామోజీరావుకు అశ్రు నివాళి అని అన్నారు. రామోజీ రావు ఇక లేరు అన్న వార్త తీవ్ర ఆవేదన కలిగిస్తోందని ఎమోషనల్ అయ్యారు. తెలుగు పత్రిక రంగంలో ఆయన కొత్త వరవడి సృష్టించారని కొనియాడారు. భావితరాల పత్రికా ప్రతినిధులకు ఒక మార్గదర్శిగా నిలిచారాని ఆకాశానికెత్తారు. చిత్ర పరిశ్రమలోనూ ఉషోదయ కిరణాలను ప్రసరింపజేశారని ప్రశంసించారు. రామోజీ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. కాగా, గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోన్న రామోజీ రావు చికిత్స పొందుతూ హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. సందర్శనార్థం ఆయన పార్థివ దేహాన్ని రామోజీ ఫిల్మ్ సిటీకి తరలించారు.



రామోజీ ఫిల్మ్ సిటీలోనే రేపు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.



## రామోజీరావు ఎవరికీ తలవంచకుండా పని చేశారు: కిషన్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** రామోజీరావు ఎవరికీ తలవంచకుండా పని చేశారని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. శనివారం రామోజీరావు పార్థివదేహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... మీడియా రంగంలో కొత్త ఒరవడిని సృష్టించారన్నారు. మద్యపాన నిషేధం, సామాజిక సమస్యలు, తెలుగు భాషను ప్రోత్సహించడం, సినిమా రంగంలో మార్పులు, ఫిల్మ్ సిటీ నిర్మాణం ఇలా ఎన్నో అంశాల్లో ఆయన కృషిని మరవలేమన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్నదాత పత్రికను తీసుకువచ్చారన్నారు. నష్టం వచ్చినా లెక్క చేయలేదన్నారు. తెలుగు భాష గురించి ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడన్నారు. ఆయన తీర్చిదిద్దిన ఎంతోమంది జర్నలిస్టులు తెలుగు రాష్ట్రాల్లో పని చేస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యసభ సీటు ఆఫర్‌ను కూడా ఆయన సున్నితంగా తిరస్కరించారని తెలిపారు. చివరి వరకు ఆయన వ్యక్తిత్వం మారలేదని... ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయామన్నారు.

### రామోజీరావుగారు నన్ను ఎంతగానో అభిమానించేవారు: బాబూ మోహన్



**విశ్వంభర, హైదరాబాద్ :** రామోజీరావు తనను ఎంతగానో అభిమానించేవారని మాజీ మంత్రి బాబూ మోహన్ అన్నారు. శనివారం రామోజీ రావు పార్థివదేహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆయనను అభిమానించే కోట్లాది మందిలో తానూ ఒకడిని అన్నారు. రామోజీ ఫిలిమ్ సిటీకి వస్తే తాను కచ్చితంగా ఆయనను కలిసే వెళ్లేవాడినన్నారు. తాను మంత్రి అయ్యాక వెళ్లి కలిస్తే చాలా సంతోషించారని గుర్తు చేసుకున్నారు. ఫిలిమ్ సిటీలో కాలానికి తగినట్లుగా సరికొత్త మార్పులు తీసుకు వచ్చారన్నారు.



## ప్రధాని సందేశాన్ని అందించిన నిర్మలా సీతారామన్

**విశ్వంభర, హైదరాబాద్ :** రామోజీరావు కుటుంబ సభ్యులకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్... ప్రధాని మోదీ సందేశాన్ని అందించారు. మరణవార్త తెలిసి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలపమని ప్రధాని తనను పంపించారన్నారు. ఆయన మరణం తెలుగువారికి తీరని లోటు అన్నారు. ఆయన ఆరోగ్యం గురించి ప్రధాని రెండు రోజుల క్రితం ఆరా తీసినట్లు చెప్పారు. ప్రజలకు ఆయన చేసిన సేవలు ప్రధానికి తెలుసునన్నారు. మనందరికీ ఇదొక పెద్ద విషాదవార్త అన్నారు.

## మొనగాడిలా ముందుకు సాగారు: నాగబాబు

రామోజీరావు పత్రికా రంగపు లెజెండ్ అని నాగబాబు అన్నారు. జర్నలిస్ట్ విలువలకు అర్థం చెప్పిన వ్యక్తి అన్నారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పెట్టిన సమయంలో... సామాన్యుడు తన భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించేందుకు వణికిపోయిన రోజున కూడా, రామోజీరావు ఈనాడు ద్వారా నిజాలను నిర్భయంగా ప్రచురించారన్నారు. సోషల్ మీడియా లేని సమయంలో మీడియాను శాసించిన ఘనత రామోజీరావుదే అన్నారు. ఎన్టీఆర్ సీఎం కావడంలో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. కలంతో కాంగ్రెస్ పార్టీకి ముచ్చెమటలు పట్టించిన ఘనత రామోజీ రావుదే అన్నారు. పత్రికా రంగంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని వైసీపీ ప్రభుత్వం ఆయనపై ఆరోపణలు చేసి... హౌస్ అరెస్ట్ చేసి ఇబ్బంది పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆది నుంచి తుది వరకు... కాంగ్రెస్ నుంచి వైసీపీ వరకు వ్యవస్థలు ఆయనను ఎన్ని అవస్థలు పెట్టినా మొనగాడిలా ముందుకు సాగారే తప్ప వెనుకడుగు వేయలేదన్నారు. మనిషి బతికున్నంత కాలం పని చేస్తూనే ఉండాలని ఎంతోమందికి మార్గనిర్దేశనం చేశారన్నారు. ఆయన ఎన్నో రంగాల్లో



అడుగుపెట్టి విజయం సాధించారన్నారు. ఆయన మరణం తెలుగు జాతికి, పత్రికా ప్రపంచానికి తీరని లోటు అన్నారు. రామోజీరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



మీడయా రంగ దిగ్గజం రామోజీ రావు మరణంతో రాష్ట్రమంతటా స్థానికులు నివాళులర్పిస్తున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ప్రముఖులంతా రామోజీ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నారు. అయితే ఆయన మీద ఉన్న అభిమానంతో సైకత శిల్పి సైకత శిల్పాన్ని తీర్చి దిద్దాడు. గుంటూరు జిల్లా సీతానగరంలోని క్రిష్ణా పుష్కర ఘాట్..ప్రతి రోజు చాలా మంది స్థానికులు ఇక్కడకు వస్తుంటారు. అయితే ఈ రోజు వచ్చిన వారందరిని అక్కడున్న సైకత శిల్పం ఆకట్టుకుంటుంది. ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావు ఈ రోజు ఉదయం హైదరాబాద్ లో కన్నుమూశారు. ఆయన మరణ వార్త తెలుసుకొని రాజకీయ, సినీ ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్నారు.ఈ క్రమంలోనే ప్రముఖ సైకత శిల్పి వర ప్రసాద్ క్రిష్ణా పుష్కర ఘాట్ రామోజీ సైకత శిల్పాన్ని తీర్చి దిద్దారు. దాదాపు మూడు గంటల పాటు శ్రమించి ఈ సైకత శిల్పానికి ఒక రూపం తీసుకొచ్చారు. సాధారణంగా సముద్ర తీరంలో ఇటువంటి సైకత శిల్పాలను తీర్చిదిద్దుతుంటారు. అయితే మొదటి సారి క్రిష్ణా నదిలోని ఇసుకతో రామోజీ సైకత శిల్పాన్ని ఆయన చనిపోయిన రోజు తీర్చిదిద్దడంతో పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు. అనంతరం ఆయనకు నివాళులర్పిస్తున్నారు. సినీ, మీడియా రంగాల్లో ఆయన చేసి క్రుషిని శ్లాఘిస్తున్నారు.



### తెలుగు ప్రజల జీవితాల్లో రామోజీ ఒక విడదీయలేని భాగం: జస్టిస్ ఎన్వీ రమణ

తెలుగు పాత్రికేయ రంగానికి కొత్త ఒరవడి దిద్దిన అక్షర యోధుడు రామోజీరావు. కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న రామోజీరావు తుదిశ్వాస విడిచారు. రామోజీరావు మృతి పట్ల సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ ఎన్వీ రమణ స్పందించారు. రామోజీరావు మరణం పట్ల ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు వెల్లడించారు. తెలుగు ప్రజల జీవితాల్లో రామోజీ ఒక విడదీయలేని భాగం అని అభివర్ణించారు. ఉదయం నుంచి రాత్రి నిద్రించే వరకు తెలుగు ప్రజల జీవితాలతో రామోజీ మమేకమై ఉన్నారని జస్టిస్ ఎన్వీ రమణ వివరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసిన సిసలైన యోధుడు రామోజీరావు అని కీర్తించారు.



### రామోజీ రావు మరణం తీరని లోటు : మాజీ మంత్రి రోజా

రామోజీరావు సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు నివాళులు అర్పిస్తున్నారు. అలానే రామోజీరావుతో తమకున్న అనుబంధం గురించి తెలుపుతూ.. ఆయన మరణంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తాజాగా రామోజీ రావు మరణంపై మాజీ మంత్రి ఆర్కే రోజా ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రముఖ సినీ నిర్మాత, పాత్రికేయ అలానే టీవి రంగంలో విప్లవాత్మక మార్పుకు విశేష కృషిని అందించిన పద్మవిభూషణ్ రామోజీరావు గారి మరణం సినీ పాత్రికేయ రంగానికి తీరనిలోటు, వారి సంస్థ ఉషాకిరణ్ పని చేసిన నాటి రోజుల నుండి ప్రతి ఇంట నవ్వులు పూయించిన టీవీషో జబర్దస్త్ వరకు వారితో ఉన్న నా అనుబంధాన్ని గుర్తు తెచ్చుకుంటూ వారి పవిత్ర ఆత్మకి శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.. రిప్ సర్ అంటూ పోస్ట్ లో రాసుకొచ్చారు.



### రామోజీరావును కలవాలని చాలాసార్లు ప్రయత్నించాను.. : ఉండవల్లి

ఈనాడు అధిపతి రామోజీరావు మరణం పట్ల మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ స్పందించారు. రామోజీ మృతికి సంతాపం తెలియజేస్తున్నట్టు ఉండవల్లి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామోజీరావు దేశవ్యాప్తంగా పేరుగాంచారని కొనియాడారు. ఏ రంగంలో ప్రవేశించినా సెలెబ్రిటీ స్థాయికి ఎదిగారని కీర్తించారు. రామోజీరావును కలవాలని చాలాసార్లు ప్రయత్నించానని, కానీ కలవలేకపోయానని ఉండవల్లి విచారం వ్యక్తం చేశారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు. నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం ఎక్కాక... అప్పటి రాజమండ్రి ఎంపీగా ఉన్న ఉండవల్లి అరుణ్ కుమార్ ఈనాడు గ్రూప్ సంస్థ మార్గదర్శిపై తీవ్ర ఆరోపణలు చేయడం, కోర్టులో పిటిషన్ లు వేయడం తెలిసిందే.



## రామోజీరావుకు నారా లోకేశ్, బ్రాహ్మణి నివాళి

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ హైదరాబాదులోని రామోజీ ఫిలింసిటీలో రామోజీరావు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. తన అర్ధాంగి నారా బ్రాహ్మణితో కలిసి వచ్చిన లోకేశ్... రామోజీరావు భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచారు. అనంతరం, రామోజీ తనయుడు కిరణ్‌ను పరామర్శించారు. నారా లోకేశ్ తోడల్లుడు, విశాఖ ఎంపీ శ్రీ భరత్, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కూడా రామోజీరావు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

### రామోజీరావు మీడియా, వినోద రంగంలో నిష్ణాతుడ: గవర్నర్ సంతాపం..



రామోజీరావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రామోజీరావు మీడియా, వినోద రంగంలో నిష్ణాతుడని, తెలుగు జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడంలో ప్రసిద్ధి చెందారని, జర్నలిజం, సాహిత్యం, సినిమా, విద్యా రంగాల్లో ఎనలేని సేవలందించినందుకు గాను రామోజీరావును పద్మవిభూషణ్‌తో సత్కరించినట్లు తెలిపారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### రామోజీరావు మరణం దిగ్భ్రాంతి కలిగించింది: వైఎస్ జగన్



రామోజీరావు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు. ''రామోజీరావుగారి మరణం దిగ్భ్రాంతికి గురిచేసింది. తెలుగు పత్రికారంగానికి దశాబ్దాలుగా ఆయన ఎనలేని సేవలందించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను. రామోజీరావుగారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను'' అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

### రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు భారీ నష్టం: కేఏ పాల్



రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు భారీ నష్టమని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. రామోజీరావు మృతి పట్ల ఆయన సంతాపం తెలిపారు. తాను తొలిసారి ఈటీవీ ద్వారానే శాంతి సందేశంతో ప్రజల ముందుకు వచ్చానని గుర్తు చేసుకున్నారు. శాంతి సందేశాలు మతపరమైనవి కావని ఆయన భావించారని పేర్కొన్నారు. రామోజీరావు మరణ వార్త విని చాలా బాధపడ్డానని తమిళ నటుడు కమల్ హాసన్ అన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీ ఓ అద్భుతమని కొనియాడారు. అది కేవలం షూటింగ్ లొకేషన్ మాత్రమే కాదని... ప్రముఖ పర్యాటక కేంద్రం కూడా అన్నారు. అంత దూరదృష్టి, వినూత్న ఆలోచనాపరుడు రామోజీరావు అన్నారు. ఆయన మరణం భారత సినీ పరిశ్రమకు తీరని లోటు అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### సమాధి ఎక్కడుండాలో రామోజీరావు ముందే నిర్ణయించారు: రఘురామకృష్ణరాజు



ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు కన్నుమూసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని నానక్ రామ్ గూడలోని స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్ సిటీకి తరలించారు. ఇక రామోజీ అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నారు. ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఫిల్మ్‌సిటీలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఆయన మృతిపట్ల టీడీపీ నేత, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. వీడియోలో రామోజీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అలాగే తన సమాధి ఎక్కడ ఉండాలో రామోజీ రావు ముందే నిర్ణయించారని ఆర్ఆర్ఆర్ తెలియజేశారు. ఇప్పుడీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. "ఉదయం లేవగానే రామోజీ రావు చనిపోయారనే వార్త నన్ను తీవ్రంగా కలిచివేసింది. కొన్ని నెలల క్రితం ఆయనతో రెండు గంటల పాటు మాట్లాడాను. నా జీవితంలో ఆ సమయం మరిచిపోలేనిది. తన సమాధి ఎక్కడ ఉండాలో కొన్నేళ్ల ముందే నిర్ణయించారు. రామోజీ ఫిల్మ్ సిటీలోని ఓ ప్లేస్‌ని ఎంపిక చేశారు. దాన్ని ఓ ఉద్యానవనంలా తీర్చిదిద్దారు" అని రఘురామకృష్ణరాజు వీడియోలో చెప్పుకొచ్చారు.







# రామోజీకి ప్రముఖుల నివాళి

















విశ్వంభర



# సినీరంగంలో రామోజీ ప్రస్థానం..







## ఆయన పరిచయం చేసిన నటులెందరో






**విశ్వంభర, హైదరాబాద్:** జీవితాంతం ప్రజా శ్రేయస్సు కోసమే పరితపించిన రామోజీరావు 'ఈనాడు' దినపత్రిక ద్వారా వేలమంది పాత్రికేయులను తయారు చేశారు. టీవీ రంగం ద్వారా వేలాది నూతన నటీనటులను బుల్లితెరకు పరిచయం చేశారు. టీవీ ప్రపంచంలో ఆయన చెరగని ముద్రవేశారు. ఆయన నెలకొల్పిన ఈటీవీ ప్లస్, ఈటీవీ సినిమా, ఈటీవీ అభిరుచి, ఈటీవీ లైఫ్, ఈటీవీ బాలభారత్ ఛానళ్లతో బుల్లితెరపై ఒక ట్రెండ్ సెట్ చేయగా.. ఈటీవీ వినోదాత్మక, విజ్ఞానదాయక కార్యక్రమాలు ఆబాలగోపాలాన్ని అలరిస్తున్నాయి. రామోజీ ఆలోచనల నుంచి పుట్టిన 'పాడుతా తీయగా' కార్యక్రమం ద్వారా ప్రేక్షకులపై సుమధుర సంగీత జల్లు కురిపించారు. వందల మంది గాయనీ, గాయకులను సంగీత ప్రపంచానికి పరిచయం చేశారు. ఎందరో మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తీసుకొచ్చారు. ఎంతోమంది సామాన్యులు రామోజీ ప్రోత్సాహంతో వినోద ప్రపంచంలో రాణించారు. ఉషాకిరణ్ మూవీస్



ద్వారా వివిధ భాషల్లో 87 సినిమాలు నిర్మించారు. ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్ ద్వారా యువ నటీనటులు పరిచయం కాగా తారలుగా ఎదిగిన ఎంతోమంది అగ్రశ్రేణి నటులుగా ఉన్నారు. ఉషా కిరణ్ మూవీస్ నిర్మించిన 'పీపుల్ ఎన్‌కౌంటర్' సినిమాతో శ్రీకాంత్ తెలుగు తెరకు పరిచయం కాగా 'నిన్ను చూడాలని' చిత్రంతో జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా పరిచయమయ్యారు. మాస్టర్ తరుణ్ అనే పేరును 'మనసు మమత' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం చేయగా 'నువ్వేకావాలి'తో కథానాయకుడిగా తరుణ్ కొత్త జీవితాన్ని మొదలు పెట్టారు. తెలుగులో ఘనవిజయం సాధించిన 'నువ్వేకావాలి' చిత్రాన్ని హిందీలో 'తుఝే మేమరీ కసమ్' పేరుతో నిర్మించిన చిత్రంతో శ్రియ, జెనీలియా, రితేశ్ దేశ్‌ముఖ్ తొలిసారిగా వెండితెరపైకి వచ్చారు. ఉషా కిరణ్ మూవీస్ నిర్మించిన 'ఇష్టం'తో తొలిసారిగా తెలుగు తెరపైకి వచ్చిన శ్రియా ప్రస్తుతం అగ్రతారగా వెలుగొందుతున్నారు. ఛాయాగ్రాహకుడిగా ఉన్న తేజ దర్శకుడైంది ఈ సంస్థ నుంచే. ఆయన దర్శకత్వంలో ఉషాకిరణ్ మూవీస్ నిర్మించిన 'చిత్రం' సినిమా ద్వారా 27మంది కొత్త నటీనటులు వెండితెరకు పరిచయమయ్యారు. దివగంత నటుడు ఉదయ్‌కిరణ్ ఈ సినిమాతోనే కథానాయకుడు అయ్యారు. గాయనిగా ఉన్న ఎస్.జానకి సంగీత దర్శకురాలైంది కూడా ఉషాకిరణ్ మూవీస్ నిర్మించిన 'మౌనపోరాటం' చిత్రంతోనే. ఈ చిత్రంలోనే ప్రముఖ కన్నడ నటుడు వినోద్‌కుమార్ తెలుగులో పరిచయమయ్యారు. మల్లికార్జున్, ఉషా, గోపికా పూర్ణిమలాంటి గాయనీ గాయకులను శ్రోతలకు చేరువ చేసింది కూడా ఈ సంస్థే. ప్రమాదంలో కాలు కోల్పోయిన నర్తకి సుధాచంద్రన్ జీవితాన్ని ఆమెతోనే ఆ పాత్రను తెరమీద ఆవిష్కరించారు. అలాగే చరణ్‌రాజ్, యమున, వరుణ్‌రాజ్, రీమాసేన్, రిచా పల్లోడ్, తనీశ్, మాధవీలతోపాటు ఎందరో నటీనటులు చిత్రసీమకు పరిచయమయ్యారు. ఇవే కాదు రాజకీయ, పాత్రకేయ రంగాల్లో ఎందరో తన సంస్థల నుంచి వెళ్లి ఆయన స్ఫూర్తితోనే నేడు అగ్రస్థాయిలో రాణిస్తున్నారు. తెలుగుదేశం కీలక నేత, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, ఇటీవల ఎంపీగా గెలుపొందిన అప్పలనాయుడు, వైసీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మెదక్ నుంచి ఇటీవల ఎంపీగా గెలుపొందిన బీజేపీ నేత రఘునందన్‌రావు గతంలో 'ఈనాడు' సంస్థల్లో పనిచేసిన వారే. ఇక పాత్రికేయ రంగానికి పుట్టినిల్లుగా చెప్పుకునే 'ఈనాడు' సంస్థల నుంచే వేలాది మంది నేడు జర్నలిజంలో అత్యున్నత స్థాయిలో రాణిస్తున్నారు. ఇలా ఎందరినో ఉన్నత శిఖరాలకు చేర్చిన మహాయోధుడు రామోజీరావు మరణం వేలాది మందిని దుఃఖసాగరంలో ముంచేసింది.



## రామోజీరావులో నేను ఓ చిన్నపిల్లవాడిని చూశా

- రామోజీరావు కలలను, ఆశయాలను కుటుంబ సభ్యులు ముందుకు తీసుకెళ్లాలి
- ప్రజారాజ్యం పార్టీ కోసం సలహాలు, సూచనలు తీసుకున్నా
- తాను పెన్నును బహుమతిగా ఇస్తే ఎంతో సంబరపడ్డారు: మెగాస్టార్ చిరంజీవి



**విశ్వంభర, రంగారెడ్డి జూన్ 08:** అందరూ రామోజీరావులోని గాంభీర్యాన్ని చూస్తే తాను మాత్రం చిన్నపిల్లాడిని చూశానని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. మీడియా దిగ్గజం రామోజీరావు పార్థివదేహానికి శనివారం మధ్యాహ్నం నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ... రామోజీ కలలను, ఆశయాలను కుటుంబ సభ్యులు ముందుకు తీసుకువెళ్లాలన్నారు. రామోజీరావుతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. తాను ప్రజారాజ్యం పార్టీని స్థాపించినప్పుడు ఆయన సలహాలు, సూచనల కోసం కలిసేవాడినని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తాను ఓ పెన్ను ఇస్తే ఎంతో సంతోషంగా తీసుకుని... సంబరపడ్డారని తెలిపారు. ఆయన దాచుకున్న పెన్నులను తనకు చూపించారన్నారు. రామోజీరావు మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అన్నారు. తెలుగు జాతి ఒక పెద్దను కోల్పోయిందన్నారు. ఆయన సమాజహితం కోసం పని చేశారన్నారు. సమాజానికి ఏం చేయాలో నిత్యం అక్షరరూపంలో రాసేవారన్నారు.

## నా జీవితంలో రామోజీరావుకు ప్రత్యేక స్థానం ఉంది

- పాత్రికేయ రంగంలో, సినిమాల్లో చరిత్ర సృష్టించిన వ్యక్తి
- రాజకీయాల్లో గొప్ప కింగ్ మేకర్
- 'నా గురువు, నా శ్రేయోభిలాషి'
- సినీ నటుడురజనీకాంత్



రామోజీరావు మృతి పట్ల దక్షిణాది సూపర్ స్టార్ రజనీకాంత్ స్పందించారు. నా గురువు, నా శ్రేయోభిలాషి రామోజీరావు ఇక లేరని తెలిసి తీవ్ర విచారానికి గురయ్యాను అని ఆవేదన వ్యక్తం చేశారు. పాత్రికేయ రంగంలో, సినిమాల్లో చరిత్ర సృష్టించిన వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. రాజకీయాల్లో గొప్ప కింగ్ మేకర్ అనిపించుకున్నారని కీర్తించారు. తన జీవితంలో రామోజీరావుకు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన నాకు మార్గదర్శకుడు, నాకు స్ఫూర్తి ప్రదాత అని రజనీకాంత్ వివరించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

## రామోజీరావు గొప్ప దార్శనికుడు..

- ఫిలింసిటీలో రామోజీరావు భౌతికకాయం
- నివాళులు అర్పిస్తున్న సెలెబ్రిటీలు
- ఎంచుకున్న ప్రతి రంగంలో విజయం సాధించారు
- సినీ నటుడు నాగార్జున



**విశ్వంభర, రంగారెడ్డి జూన్ 08:** ఈనాడు సంస్థల అధినేత, పాత్రికేయ రంగ కురువృద్ధుడు రామోజీరావు అస్తమయం చెందారు. కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయన ఈ తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. రామోజీ ఫిలింసిటీలోని నివాసంలో రామోజీ భౌతిక కాయాన్ని ఉంచారు. ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు. టాలీవుడ్ సీనియర్ హీరో నాగార్జున, తన సోదరి నాగసుశీలతో కలిసి ఫిలింసిటీకి వచ్చి రామోజీరావు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. రామోజీరావు గొప్ప దార్శనికుడు, ఎంచుకున్న ప్రతి రంగంలో విజయాలను అందుకున్నారని నటుడు నాగార్జున అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. అనంతరం, రామోజీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామోజీ తనయుడు కిరణ్ తో మాట్లాడి, ఆయనను ఓదార్చారు.

## రామోజీకి భారతరత్న ఇవ్వాలన్న రాజమౌళి, అల్లు అర్జున్



- రామోజీరావు మృతిపట్ల దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సంతాపం
- ఆయనకు భారతరత్న ఇవ్వడమే సరియైన నివాళి అంటూ వ్యాఖ్య
- నా మనసులో కూడా అదే భావన కలిగింది సార్ అంటూ బన్నీ రిప్లై

ఈనాడు గ్రూప్ చైర్మన్ రామోజీరావు మృతి పట్ల టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సంతాపం తెలిపారు. ఈ నేపథ్యంలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన రామోజీరావుకి భారతరత్న ఇవ్వడం సముచిత గౌరవం అని పేర్కొన్నారు. "ఒక మనిషి 50 ఏళ్ల కాలంలో అనేక రంగాల్లో వివిధ సంస్థలు స్థాపించి వాటిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడం అనేది మాములు విషయం కాదు. వాటి ద్వారా ఎన్నో లక్షల మందికి జీవనోపాధి, ఆశలను అందించి మార్గదర్శకంగా నిలిచారు. అలాంటి వ్యక్తికి భారతరత్న ఇవ్వడమే సరియైన నివాళి అవుతుంది" అంటూ రాజమౌళి తన ట్వీట్‌లో రాసుకోచ్చారు. ఇక రాజమౌళి ట్వీట్‌పై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ స్పందించారు. "నా మనసులో కూడా అదే భావన కలిగింది సార్. మీరు నా మనసులోని మాట చెప్పారు. మీరు నా హృదయంతో మాట్లాడారు. దానికి గాత్రదానం చేసినందుకు ధన్యవాదాలు" అంటూ బన్నీ రిప్లై ఇచ్చాడు.

## రామోజీరావు నటించిన సినిమా ఏదో తెలుసా..?

రామోజీరావు కొన్ని గంటల క్రితం మరణించిన సంగతి తెలిసిందే. సామాన్యుడి నుంచి అతిపెద్ద సామ్రాజ్య అధినేతగా ఎదిగిన ఆయన.. ఏ రంగంలోకి వస్తే ఆరంగంలో అగ్రభాగానే రాణించారు. మీడియా రంగంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిన ఆయన.. సినిమా ఇండస్ట్రీకి ఓ పెద్ద దారి చూపించారు. అయితే ఆయన ఎన్నో సినిమాలను తీశారని మాత్రమే తెలుసు. కానీ ఆయన కూడా ఓ సినిమాలో నటించాడని చాలామందికి తెలియదు. ఒక సినిమాలో చిన్న అతిథి పాత్రలో నటించారు రామోజీ. 1978లో యు విశ్వేశ్వర రావు నిర్మించిన మార్పు అనే సినిమాలో రామోజీరావు ఒక న్యాయమూర్తి పాత్రలో నటించారు. ఇక్కడ ఓ విషయం ఏంటంటే.. రామోజీ రావు నటించింది కేవలం అతిథి పాత్రలోనే. కానీ అప్పట్లో ఆ సినిమా పోస్టర్ మీద రామోజీరావు ఫొటో వేసి ప్రచారం చేయడం అందరినీ ఆకర్షించింది. ఎందుంకటే అప్పట్లో రామోజీ చరిష్మా అలా ఉండేది మరి. ప్రస్తుతం రామోజీరావు మరణించిన నేపథ్యంలో ఆయనకు సంబంధించిన ఎన్నో విషయాలు వైరల్ అవుతున్నాయి.



గేమ్ ఛేంజర్ మూవీ షూటింగ్‌లో రామోజీరావుకు

## నటుడు రామ్‌చరణ్, దర్శకుడు శంకర్ నివాళి

- రాజమండ్రిలో చిత్రీకరణ జరుపుకుంటున్న "గేమ్ ఛేంజర్"
- షూటింగ్ స్పాట్‌లో రెండు నిమిషాలు మౌనం పాటించిన టీం
- పత్రికా రంగంపై రామోజీ చెరగని ముద్రవేశారన్న చిత్ర బృందం

పత్రికా రంగంలో అడుగుపెట్టి సంచలనాలు నమోదుచేసి, ఆ రంగంపై చెరగని ముద్రవేసిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు ప్రముఖ నటుడు రామ్‌చరణ్, దర్శకుడు శంకర్, సునీల్, రఘు కారుమంచి, యూనిట్ సభ్యులు నివాళులు అర్పించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న "గేమ్ ఛేంజర్" మూవీ ప్రస్తుతం రాజమండ్రిలో చిత్రీకరణ జరుపుకుంటోంది. రామోజీ మరణ వార్త తెలిసిన వెంటనే చిత్ర బృందం అక్కడే రెండు నిమిషాలపాటు మౌనం పాటించి నివాళులు అర్పించింది. రామోజీ మరణం తీరని బాధాకరమని, ఆయన మరణం తెలుగు ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ ఎక్స్‌లో తన సంతాపాన్ని ప్రకటించారు. ఈనాడు పేపర్‌తో ప్రాంతీయ మీడియా స్వరూపాన్నే రామోజీ మార్చివేశారని ప్రశంసించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్మ్ స్టూడియో అయిన రామోజీ ఫిల్మ్ సిటీ స్థాపన ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చిత్ర నిర్మాతలకు ల్యాండ్ మార్క్ అయిందని పేర్కొన్నారు. రామోజీ తన ఆప్యాయతతో తెలుగు ప్రజలకు చేసిన విశేష కృషికి చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుకుంటున్నట్టు పేర్కొన్నారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com